


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-11-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 274 పేజీలు: 8+16 వెల: 6.50

అమిత్‌షాతో చిరంజీవి భేటీ 3

బంగ్లాలో మళ్లీ చెలరేగిన హింస 5



రాహుల్ ప్రధాని కాలేరు

ఓట్లపై కాంగ్రెస్ చేసేది అసత్య ప్రచారం

నకిలీ, చొరబాటుదార్ల ఓట్లు కాపాడుతున్నారు..

ఢిల్లీ కాంగ్రెస్‌కు తెలంగాణను ఎటిఎంగా మార్చిన సిఎం రేవంత్

యుపిఎ వాయాంలో అంతా అవినీతి చరిత్రే.. రాష్ట్రంలో నిస్సిగ్గుగా రాహుల్-రేవంత్ టాక్స్ వసూలు

తెలంగాణ గడ్డపై బిజెపి జెండా ఖాయం.. మహాపాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

హైదరాబాద్‌లో సోమవారం మహాపాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు తదితరులు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు2: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేద్దామని. ప్రజాస్వామ్యాన్ని కాపాడి,ఇక్కడి అరాచకశక్తులను తుదముట్టిద్దామని కేంద్ర హోం శాఖ మంత్రి ఆమిత్‌షా స్పష్టం చేశారు. త్వరలోన తెలంగాణలో బిజెపి అధికారంలోకి రాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం-అరాచకత్వాన్ని అంతం చేద్దాం'పేరుతో కొనసాగిన మహా పాదయాత్ర ముగింపు సభలో కేంద్ర హోంమంత్రి >>2



సోమవారం హైదరాబాద్ బిజెపి మహాపాదయాత్రలో పాల్గొన్న అశేష ప్రజానీకం



సోమవారం హైదాబాద్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్.
చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, సిఎస్ సంజయ్ జాజు తదితరులు

అపూర్వ రీతిలో ఖేలో ఇండియా

గ్లోబల్ సమ్మిట్ తరహాలోనే ఏర్పాట్లు

పాల్గొంటున్న ఏడు వేల మంది క్రీడాకారులు

ఒలింపిక్స్ పతకాలే లక్ష్యంగా 27 రకాల క్రీడా పోటీలు: సిఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 8వ ఎడిషన్ క్రీడల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీలకు ఎక్కడా ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు.మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ >>2

క్లీన్, గ్రీన్ సిటీగా హైదరాబాద్‌కు మెరుగులు 2

చెత్త సేకరణలో నిర్లక్ష్యం సహించం: సిఎం



బోర్‌వెల్స్‌పై 6 నెలలు నిషేధం!

తాగునీటి అవసరాలకు మినహాయింపు

క్షీణిస్తున్న నీటి మట్టాలకు చెక్

ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు


హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: రాష్ట్రంలో క్షీణిస్తున్న భూగర్భ జల నిల్వల తరుగుదలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన ఆంక్షలు అమలు చేయనుంది. ఇందుకు గాను అమలు చేయాల్సిన కార్యాచరణకు సంబంధించిన ప్రతిపాదనలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో భూగర్భ జలాలు పలు చోట్ల తీవ్ర ప్రమాద స్థాయికి పడిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి నానాటికి నీటి నిల్వలు క్షీణిస్తున్నాయి. 7 జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టం 10 నుంచి 15 మీటర్లకు, 19 జిల్లాల్లో 5 నుంచి 10 మీటర్లకు, మిగతా 7 జిల్లాల్లో 5 మీటర్ల కంటే తక్కువకు పడిపోయాయి. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 11.96 మీటర్లకు నీటిమట్టాలు పడిపోయాయి. గతేడాది కాలంలో అక్కడ 6.17 మీటర్లమేర నీటిమట్టాలు తగ్గాయి. అలాగే >>2

ఆర్థికవృద్ధిలో ఎదురులేదు..



పశ్చిమాసియా సంక్షోభం ఉన్నా భారత్
ఇంధన భవిష్యత్తుకు పూర్తి భద్రత
ఢిల్లీ విద్యుత్ సదస్సులో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, నవంబరు 2: పశ్చిమాసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ, భారత్ ఆర్థిక వృద్ధి బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. నిరంతరాయంగా శిలాజ ఇంధనాలపై ఎక్కువ ఆధారపడటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోందని వ్యాఖ్యానించారు. ఇంధన భద్రత భవిష్యత్తు అంతా క్లీన్ ఎనర్జీలోనే దాగి ఉందని ఆయన స్పష్టం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో 2026 సదస్సును ప్రారంభించి అనంతరం మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రపంచ సంక్షోభాలు ప్రతి దేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయని మోడీ అన్నారు. ఇంధన భద్రతకు ఆర్థిక స్థిరత్వంతో ఉన్న బలమైన సంబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఫాసిల్ ఫ్యూయెల్స్ నిల్వలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పరిమితంగా ఉన్నాయని, అయితే పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యానికి అంతులేదని వివరించారు. ప్రతి ప్రాంతం, ప్రతి దేశం కూడా సోలార్, విండ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకునే అవకాశం ఉందని చెప్పారు. గత దశాబ్ద కాలంలో భారత్ సకాలంలో దేశీయంగా పెట్టుబడులు పెంచడం, పలు కీలక కార్యక్రమాల్ని అమలు చేయడం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై మరీ ఎక్కువగా పడకుండా అడ్డుకోగలిగామని ప్రధాని వివరించారు. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధించిన పురోగతిని మోడీ వివరించారు. భారతస్వచ్ఛ ఇంధనరంగాన్ని కేవలం హైడ్రో, సోలార్, విండ్, న్యూక్లియర్ విద్యుత్ వనరులకే పరిమితం చేయట్లేదని, గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ ముందడుగు వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థంలో సగానికిపైగా వాటాను నాన్ ఫాసిల్ ఇంధన వనరుల ద్వారా సాధించాలనే పారిస్ ఒప్పందం లక్ష్యాన్ని నిర్దేశించిన సమయం కంటే ఐదేళ్ల ముందుగానే, అంటే 2025 నాటికే భారతదేశం విజయవంతంగా చేరుకుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దేశ మొత్తం విద్యుత్ సామర్థంలో ఈ శిలాజయేతర వనరుల వాటానే 50 శాతానికిపైగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలనే సివోపీ26 లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తూ ఇప్పటికే దాదాపు 300 >>2



ఎండిన పంటలను పరిశీలిస్తున్న హరీష్‌రావు

కృష్ణ పారుతున్నా పంటకు మంటేనా?

నీటి నిర్వహణ లోపంతో 25 లక్షల ఎకరాల్లో ఎండిన పంట

కల్వకుర్తి మెటార్లు 24 గంటలు నడవాలి

జూరాల నుంచి మరో 15 రోజులు నీళ్లివ్వాలి

రైతన్నల రణభేరిలో హరీష్‌రావు

వనపర్తి, నవంబరు 2 ప్రభాతవార్త: కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా పాలమూరు రైతుల పొలాలు ఎండిపోవడం ప్రభుత్వ సాగునీటి నిర్వహణ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష ్యం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాలలో సోమవారం నిర్వహించిన రైతన్నల రణబేరి సభలో ఆయన >>2

మురసు ముసురు!

4 రోజులు తెలంగాణకు భారీ వర్ష సూచన



హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త:బంగాళాఖాతంలో రేగిన మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌వైపు శరవేగంగా దూసుకొస్తోంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమవాయువ్య దిశగా పయనిస్తున్నది. ఒంగోలుకు దక్షిణంగా, నెల్లూరు నరసాపురం మధ్య తీరం దాటేందుకు సిద్ధమైంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్యలో ఇది తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారి, గంటకు 100 >>2



బల్గేరియా తొలి మహిళా ప్రెసిడెంట్‌గా ఇలియానా యోటోవా 7

11 నుంచి కెటిఆర్ బస్సుయాత్ర

29న మానకొండూరు ప్రాంతంలో భారీ బహిరంగ సభ

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న వేళ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు బిఆర్ఎస్ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని ఈ యాత్ర సాగనుంది. మరోవైపు.. తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు సుమారు >>2

రెవెన్యూ, ఫారెస్ట్ భూముల జాయింట్ సర్వే

గ్రామాల నుంచి రాష్ట్రస్థాయి దాకా అదే విధానం

సరిహద్దు వివాదాల పరిష్కారానికి సమన్వయంతో సాగాలి

సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా: మంత్రి పొంగులేటి



సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: రెవెన్యూ, అటవీ (ఫారెస్ట్) భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని రెండువిభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భూ >>2



సోమవారం న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

6 నెలలు నిషేధం!

>> హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో కూడా భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. అత్యంత తక్కువ లోతులో (3.50 మీటర్లు) ఖమ్మం జిల్లా ఉంది. ఇక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో విపరీతంగా బోర్లు వేయడం, నీటిని విచ్చలవిడిగా వినియోగించడం భూగర్భ జలాల పతనానికి ప్రధాన కారణాలు. ఒకప్పుడు 300 నుండి 500 అడుగుల లోతులో నీరు లభించేది. ప్రస్తుతం గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 2 వేల అడుగుల లోతులో కూడా నీరు దొరకడం లేదు. భూగర్భ జలవనరుల శాఖ నిబంధనల ప్రకారం గరిష్టంగా 120 నుంచి 150 అడుగుల లోతు వరకు మాత్రమే బోర్లు వేయాల్సి ఉన్నా వాటిని ఖాతరు చేయడం లేదు. ఈ నేపథ్యంలో భూగర్భ జల వనరులు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు మినహా, ఇతర అవసరాలకు భూగర్భ జలాల వెలికితీతపై ఆంక్షలు విధించనుంది. అలాగే ఆంక్షల నుండి మినహాయించబడే సంస్థలు, వాటి కార్యకలాపాలను పేర్కొంటూ త్వరలో జీవో జారీ చేయబడుతుందని భూగర్భ జల వనరుల సీనియర్ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా బోర్‌వెల్‌లపై నిషేధం విధించే అవకాశం ఉంది ప్రతిపాదిత చర్యలలో కొత్త బోర్‌వెల్‌ల తవ్వకంపై నిషేధం కూడా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో బోర్‌వెల్ నీటిని అనేక అనవసర అవసరాలకు వినియోగిస్తున్నందున, అస్థిరంగా భూగర్భ జలాలను వినియోగించడంపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఈ నిబంధన నిర్దేశిత ప్రాంతాలలో కొత్త బావుల తవ్వకాలను నిషేధించడానికి కూడా అనుమతిస్తుంది. మరోవైపు, సెక్షన్ 10, ఈ నిబంధన పరిధిలోకి వచ్చే ప్రాంతాలలో ప్రజల తాగునీటి వనరులకు 250 మీటర్ల పరిధిలో బావుల తవ్వకాన్ని నియంత్రించనుంది. నిర్దిష్ట మినహాయింపులకు లోబడి, నియమించబడిన అథారిటీ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితి అమల్లోకి రానుంది. అనుమతి మంజూరు చేసిన తర్వాత కూడా, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే, సంబంధిత సంస్థ నీటి వెలికితీతను తదనంతరం పరిమితం చేయవచ్చు లేదా నియంత్రించే వీలుంటుంది. భూగర్భ జలాలను అక్రమంగా తోడుతున్నట్లు తేలితే, ఉల్లంఘించిన వారికి రూ.5 వేల నుండి రూ.1 లక్ష వరకు జరిమానా విధించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. తరిగిపోతున్న భూగర్భ జల నిల్వలను పరిరక్షించడం, ఈ వనరులు తీవ్రంగా తగ్గిపోకముందే అనవసర వినియోగాన్ని అరికట్టడం ఈ చర్య యొక్క లక్ష్యం అని భూగర్భ జల శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఆంక్షలను అమలు చేయడానికి ప్రభుత్వం తెలంగాణ జల, భూమి మరియు చెట్ల (వాల్టా) చట్టం, 2002లోని సెక్షన్ 9 మరియు 10లను ప్రయోగించాలని యోచిస్తోంది. సెక్షన్ 9 ప్రకారం, భూగర్భ జలాలను తోడటం వలన భూగర్భ జల మట్టాలు తగ్గే అవకాశం ఉన్నా లేదా సహజ వనరులు, పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉన్నా, నియమిత అధికారి, అధికార సంస్థ ఆమోదంతో, ఒక నిర్దిష్ట ప్రాంతంలో వ్యక్తులు, సమూహాలు లేదా ప్రైవేట్ సంస్థలు భూగర్భ జలాలను తోడకుండా నిషేధం విధించనుంది. ఈ నిషేధం 6 నెలల వరకు అమలులో ఉండనుంది. అయితే సమీక్ష అనంతరం ఒక్కోసారి మరో ఆరు నెలల వరకు పొడిగించే అవకాశం ఉంటుందని భూగర్భ జల వనరుల శాఖ స్పష్టం చేస్తోంది.

పంటకు మంటేనా?

>> మాట్లాడారు. అంతకుముందు అల్వాల పరిసరాల్లో సాగునీరు అందక ఎండిపోయిన వరి పంటలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు పరిశీలించారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే దశలో నీళ్లు అందక నష్టపోయామని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. బాధిత రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఒక్క అల్వాల గ్రామంలోనే సుమారు 250 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా 24 నుంచి 25 లక్షల ఎకరాల్లో ఇదే పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

నీళ్లున్నా.. ఎత్తిపోయలేదని విమర్శలు..

శ్రీశైలం ప్రాజెక్టుకు 221 టీఎంసీలు, జూరాల ప్రాజెక్టుకు 252 టీఎంసీల నీరు వచ్చినప్పటికీ సకాలంలో మోటార్లు నడపకపోవడంతో రైతులు నష్టపోయారని హరీశ్‌రావు ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఐదు మోటార్లను పూర్తిస్థాయిలో నడిపితే రోజుకు సుమారు 0.3456 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని, ఐదు నెలల్లో 50 టీఎంసీల వరకు వినియోగించుకునే అవకాశం ఉన్నా కేవలం 18 టీఎంసీలే ఎత్తారని విమర్శించారు. కృష్ణా జలాలు పక్క రాష్ట్రానికి తరలిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జూరాల నుంచి మరో 15 రోజులపాటు నీటిని విడుదల చేసి చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి..

కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకోవడం కాకుండా పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని హరీశ్‌రావు కోరారు. యాసంగి రైతుబంధు విడుదల చేయడంతో పాటు వ్యవసాయ కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, హార్వెస్టర్ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రకటించిన రూ.12 వేల సాయం అందించాలని కోరారు. కల్వకుర్తి ఐదు మోటార్లను 24 గంటలు నడిపి చెరువులను నింపాలని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో అడ్డంకులను తొలగించి కరివేన, వట్టెం రిజర్వాయర్లకు నీటిని తరలించాలని ప్రభుత్వానికి సూచించారు. రైతుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు అన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ఆత్మస్థైర్యంతో ఉండాలని కోరారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించి ప్రత్యేక బృందాలను పంపి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ..కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతంలో వనపర్తి జిల్లాలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం పంటలు ఎండిపోతుండటం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నించారు.

రాహుల్ ప్రధాని కాలేరు



హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

>> అమిత్ షా మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని అంతం చేద్దాం' మహా పాదయాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా సాగింది. ఎల్బీ స్టేడియం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు కొనసాగిన ఈ మహా పాదయాత్రలో వేలాది మంది కార్యకర్తలకు అభివాదం చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముందుకు నడిచారు. అనంతరం ఎంజే మార్కెట్ కూడలి వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి అరాచకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రసంగం ప్రారంభంలో భాగ్యలక్ష్మి అమ్మవారికి, హైదరాబాద్‌ను భారతదేశంలో అంతర్భాగం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు, విప్లవ వీరులు కొమురం భీమ్, రాంజీ గోండ్‌లకు శిరస్సు వంచి ప్రణామం చేశారు. సర్దార్ పటేల్ నాడు నిజాంను లొంగదీసుకోకపోతే నేడు హైదరాబాద్ భారత్‌లో భాగమై ఉండేది కాదని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు పిడికిలి బిగించి సంకల్పం తీసుకోవాలని, రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీపై నిప్పులు చెరుగుతూ..అది ఓట్ బచావో ర్యాలీ కాదని, పచ్చిగా చొరబాటుదారులను కాపాడే (ఘుస్‌పైఠియా బచావో) ర్యాలీ అని అమిత్ షా కొట్టిపారేశారు. దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "ఈ 13 కోట్లలో దాదాపు 6.5 కోట్ల ఓట్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారివి. ఒక వ్యక్తి రెండు చోట్ల ఓటు వేసే హక్కు ఉంటుందా? అని ప్రశ్నించారు. దాదాపు 3 కోట్ల మంది చనిపోయిన వారివి. చనిపోయిన వారి పేరిట కాంగ్రెస్ బోగస్ ఓటింగ్ చేయాలని చూస్తోంది. మరో కోటి ఓట్లు డూప్లికేట్ ఎంట్రీలు ఉన్నవి. మిగిలిన 3 కోట్ల ఓట్లు దేశంలో ఉనికిలోనే లేని బంగ్లాదేశ్ చొరబాటుదారులవి అని వివరించారు. 'ఈ నకిలీ, చొరబాటుదారుల ఓట్లను కాపాడేందుకే రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎంత శ్రమించినా... ఈ దేశంలో ఒక్క బంగ్లాదేశ్ చొరబాటుదారుడినీ ఓటర్ల జాబితాలో ఉండనివ్వం. దేశం నుంచి వారిని వెళ్లగొట్టి తీరుతాం. కేవలం దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంద'ని అమిత్ షా హెచ్చరించారు.

ఎస్ఐఆర్ వల్లే బీజేపీ గెలుస్తోందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. 2014, 2019లలో ఎస్ఐఆర్ లేకుండానే దేశ ప్రజలు నరేంద్ర మోదీకి సంపూర్ణ మెజారిటీ ఇచ్చారని, 2024 తర్వాత హర్యానా, మహారాష్ట్రల్లో భారీ మెజారిటీతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈవీఎంల వల్ల బీజేపీ గెలుస్తోందని కాంగ్రెస్ నెపం మోపడంపై ఎద్దేవా చేస్తూ.."గెలిస్తే ప్రజలు గెలిపించినట్టు, ఓడితే ఈవీఎంలను నిందించడం 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్లుంది.. ఈవీఎంలే కారణమైతే తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది? తమిళనాడు, కేరళంలో బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి? అని ప్రశ్నించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు మేం సిద్ధం. కాంగ్రెస్‌కు దమ్ముంటే పార్లమెంటులో చర్చకు ఎందుకు ముందుకు రావడం లేదు? అని ప్రశ్నించారు. మాక్ పార్లమెంట్‌లో తప్ప రాహుల్ గాంధీ ఎప్పటికీ దేశానికి ప్రధాని కాలేరని అమిత్ షా చురకలంటించారు. తెలంగాణను రేవంత్ రెడ్డి సర్కారు ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మార్చిందని హోంమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో నిస్సిగ్గుగా ఆర్ఆర్ ట్యాక్స్ (రాహుల్-రేవంత్ ట్యాక్స్) వసూలు చేస్తున్నారని, ప్రజల సొమ్మును దోచుకుని ఢిల్లీ కాంగ్రెస్‌కి మూటలు పంపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన గ్యారెంటీలు అమలుకాక కుప్పకూలిపోయాయని, 10 ఏళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌దని నిప్పులు చెరిగారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేకుండా దేశాన్ని అగ్రపథాన నడిపిస్తున్నారని కొనియాడారు. త్వరలోనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తానని స్పష్టం చేశారు. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? అని అడిగారు. తాము ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటామని, తెలంగాణలో బీజేపీ సర్కార్ వచ్చేందుకు తమకు అండగా ఉండాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకునే సత్తా బీఆర్ఎస్, ఎంఐఎంలకు లేదని, కాంగ్రెస్ అవినీతిపై పోరాడి ప్రజలకు న్యాయం చేసే ఏకైక శక్తి భారతీయ జనతా పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్ పార్టీని శాశ్వతంగా సాగనంపి, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యకర్తలు సమరశంఖం పూరించాలని అమిత్ షా పిలుపునిచ్చారు. ఈ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ బోర్డు మెంబర్ డా.కె.లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, గోడం నగేశ్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికవృద్ధిలో ఎదురులేదు..

>> గిగావాట్ల మైలురాయిని చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. రానున్న పదకొండేళ్లలో దేశీయంగా మరో 500 గిగావాట్ల శిలాజయేతర విద్యుత్ సామర్థ్యాన్ని అదనంగా జోడించడమే భారతదేశ తదుపరి లక్ష్యమని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ఉద్దేశించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పురోగతిని మోడీ వివరించారు. 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా కోటి కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో 65 లక్షలకుపైగా ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం అందిందని తెలిపారు. దీంతో ఆయా కుటుంబాల విద్యుత్ బిల్లులు సుమారు 76 శాతం తగ్గాయని చెప్పారు. ఇదే సమయంలో పీఎం కుసుమ్ పథకం కింద 30 లక్షలకుపైగా రైతులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం కలుగుతోందని ప్రధాని పేర్కొన్నారు.

వారం - వర్జ్యం

03-11-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.నవమి ఉ.11.57, న.మఖ రా.3.27,
వ.మ.3.37 - మ.5.12,
దు.1. ఉ.8.23-ఉ.09.09,
దు.2. రా.10.12-రా.10.58,
రాహు. మ.3.00-4.30, శుభ.స. లేదు

వార్తాఫలం

మేషం : మీ ప్రమేయం, పర్యవేక్షణ నామమాత్రంగానున్న సందర్భాలలో సైతం మీ వాళ్ళ మంచి పురోగతి సాధిస్తారు.

వృషభం : దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసివస్తాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

మిథునం : పలు విషయాలలో అభిప్రాయ భేధాలు వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తాయి.

కర్కాటకం : మీ వ్యక్తిగత విషయాలను బయటకు వెల్లడిచేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. శుభ ఆహ్వానాలు.

సింహం : మీ కార్యాచరణకు సంబంధించిన ప్రణాళికలు పలువురితో ముడిపడి ఉండడం వలన పురోభివృద్ధి వేగంగా ఉండదు.

కన్య : వాహనాల మరమ్మత్తులకుగాను అధిక వ్యయము అవుతుంది. వ్యక్తిగత విషయాలలో సంయమనము పాటించండి.

తుల : మీ ఆస్తుల సంపూర్ణ వివరాలు మీ సన్నిహితులకు కూడా తెలియకుండా జాగ్రత్త పడతారు. ఆభరణాల కొనుగోలు.

వృశ్చికం : ఓర్పు నేర్పులతోనే కార్యసాధన అవుతుంది. సహనమునుకు పరీక్షలు ఎదురు అవుతాయి. అనుకోని ప్రయాణాలు.

ధనుస్సు : గత అనుభవం ద్వారా కొన్ని సమస్యల నుండి తప్పించుకుంటారు. కుటుంబ సభ్యుల అభివృద్ధికోసం కృషి చేస్తారు.

మకరం : అధిక శ్రమవలన ఆరోగ్యపరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఉంటాయి. వాహనాల కొనుగోలు ముమ్మరం చేస్తారు.

కుంభం : ఉద్యోగపరంగా మీస్థాయి తగ్గనున్నదని శత్రువర్గం ప్రచారం అధికం అవుతుంది. ఆర్థికపరమైన ఒత్తిళ్ళు ఉంటాయి.

మీనం : కొద్దిపాటి ఒడిదుడుకులు మినహా ఈరోజు సాఫీగా సాగుతుంది. రాజకీయ రంగాల వారికి యోగదాయకం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

అపూర్వ రీతిలో ఖేలో ఇండియా

>> పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘ కాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలు ఒక గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ఈ సందర్భాంగా సీఎం అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేలో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లు చెయ్యాలని సీఎం సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో క్రీడలు, క్రీడాభివృద్ధికి సంబంధించిన పెట్టుబడుల ఆకర్షణ కూడా ఒక భాగం అయినందున అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది ఖేలో ఇండియా పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలన్నారు. ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకునే విధంగా గ్రూప్1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించాలన్నారు. వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయా చోట్ల స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్1 అధికారులను నియమించాలన్నారు. క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపై సమాచారమివ్వాలన్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా పోటీల్లో జరిగిన పరిణామాలు నివృత్తి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కొన్ని చోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు క్రీడా పోటీలు ముగిసిన కొన్నేళ్లలోనే విచ్ఛిన్నం అయ్యాయని గుర్తు చేశారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసరమైన ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులతో పాటు సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ సహా 6 నగరాల్లో 20 చోట్ల 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ కర్రసాము క్రీడను కూడా ఆతిధ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సోమవారం న్యూఢిల్లీలో బీహార్ మాజీ సీఎం లాలు ప్రసాద్ యాదవ్‌ను పరామర్శించిన సోనియాగాంధీ

రెవెన్యూ, ఫారెస్ట్ భూముల జాయింట్ సర్వే

>> వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని , ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ భూముల మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జాయింట్ సర్వే తో శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావులేకుండా స్పష్టమైన హద్దులను నిర్ధారించాలన్నారు. ఈ సమస్యలను ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతగా నెట్టివేసే ధోరణి విడనాడాలని, పరస్పర సమన్వయంతో పరిష్కార దిశగా అడుగులు వేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇకపై రెవెన్యూ-అటవీ భూ సరిహద్దు వివాదాల పరిష్కార ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. రెండు శాఖల మధ్య సమన్వయానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తానన్నారు, శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తిరిగి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వతంగా తెరపడుతుందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి ముం దుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే సెటిల్‌మెంట్ కమీష నర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పిసిసిఎఫ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురసు ముసురు!

>> నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రచండ ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. తీర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు 1 నుంచి 1.5 మీటర్ల మేర సముద్రపు నీటితో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మురసు ప్రభావం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా తెలంగాణపైనా తీవ్రంగా ఉండబోతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నాలుగు రోజుల పాటు తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. మంగళవారం నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ అలర్ట్ జారీ చేసింది. సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుపాను తీవ్రత దృష్ట్యా కోస్తా తీరంలోని ఓడరేవుల్లో ప్రమాద సూచికలు ఎగురవేశారు. అత్యంత ప్రమాదకర పరిస్థితులను సూచిస్తూ బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, వాడరేవు పోర్టుల్లో 10వ నంబర్ సిగ్నల్ జారీ చేశారు. మచిలీపట్నం పోర్టులో 9వ నంబర్, కృష్ణపట్నంలో 8వ నంబర్ ప్రమాద హెచ్చరికలు ఎగురవేశారు. విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ రేవుల్లో 3వ నంబర్ హెచ్చరికలను కొనసాగిస్తున్నారు.

క్లీన్, గ్రీన్ సిటీగా హైదరాబాద్‌కు మెరుగులు

చెత్త సేకరణలో నిరక్ష్యం సహించం

తొలివిడతలో 28 గ్రీన్ ట్యాంకర్లు

సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్ఫ్రస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జిహెచ్‌ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్ బస్సుయాత్ర

>> 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. కేటీఆర్ బస్సు యాత్ర నవంబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య 2 రోజులపాటు నిర్వహించనున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో బస్సు యాత్ర మార్గం, దీక్షా దివస్ సభ నిర్వహణ, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ బస్సు యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగనుంది. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు వాటి ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. సాగునీటితో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూడా యాత్రలో ప్రస్తావించనున్నారు. సాగునీటి అంశాన్ని రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రను వేదికగా చేసుకోనున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకుసంబంధించిన జ్ఞాపకాలనుప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేయనున్నారు. ఈ చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతంలోనే సభ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో సభ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. ఈ దీక్షా దివస్ కార్యక్రమానికి సుమారు 50 వేల మందిని సమీకరించాలని బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గంగుల చెప్పారు.



విమాన టికెట్ ధరలు 700 శాతం పెంపుపై పిటిషన్

అలా అయితే విమానంలో వెళ్లకండి : సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 2: విమాన టికెట్ల ధరలు భారీగా పెరుగుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. విమాన చార్జీలు ఏకంగా 700 శాతం వరకు పెరుగుతున్నాయన్న న్యాయవాది వాదనపై జస్టిస్ విక్రమ్ నాథ్ తీవ్రంగా స్పందించారు. విమానంలో ప్రయాణించకండి అంటూ వ్యాఖ్యానించారు. విమాన ప్రయాణం ప్రస్తుతం అత్యవసర సేవగా మారిందని, టికెట్ ధరలను భారీగా పెంచడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని, ప్రతి ఒక్కరికీ సమాన రక్షణ కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ వాదనను ఆ సమయంలో పరిగణనలోకి తీసుకోవడానికి జస్టిస్ విక్రమ్‌నాథ్ నిరాకరించారు. సుప్రీంకోర్టు న్యాయవాది చారు మాథుర్, పిటిషనర్ ఎస్. లక్ష్మీనారాయణన్ తరఫున ఈ పిటిషన్ దాఖలు చేశారు. దేశీయ విమానయాన సంస్థలు వసూలు చేస్తున్న టికెట్ ధరలు, అదనపు ఛార్జీలపై సమర్థవంతమైన నియంత్రణ తీసుకురావాలని పిటిషన్‌లో కోరారు. పండుగలు, సెలవుల సమయంలో విమాన టికెట్ల ధరలను ఇష్టానుసారంగా పెంచుతున్నారని, ఉచిత చెక్‌ఇన్ బ్యాగేజీ పరిమితిని కూడా తగ్గించారని పిటిషనర్ ఆరోపించారు. ఇంధన ధరలు పెరిగితే విమానయాన సంస్థలు టికెట్ ధరలను సవరించుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే కేవలం డిమాండ్ ఆధారంగా ధరలను నిర్ణయిస్తూ సాధారణ ధర కంటే ఏడు రెట్లు అధికంగా వసూలు చేయడం దోపిడీతో సమానమని, అత్యవసర సేవలకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని చారు మాథుర్ వాదించారు. ప్రైవేట్ విమానయాన సంస్థలు అనుసరిస్తున్న ధరల విధానాలపై గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా పండుగలు, సెలవులు, అధిక ప్రయాణ డిమాండ్ ఉన్న సమయాల్లో టికెట్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని గతంలో విచారించిన సుప్రీంకోర్టు కూడా ఈ అంశంపై స్పందించింది. విమాన టికెట్ ధరల్లో పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రయాణికులను అన్యాయమైన ధరల పెంపు, అదనపు ఛార్జీల నుంచి రక్షించేందుకు స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

దేశంలో తగ్గిన బొగ్గు దిగుమతి

5.83 శాతం మేర 104.57 టన్నులకు చేరిక

విద్యుత్ ప్లాంట్ల ద్వారా 6.39 శాతం తగ్గిన దిగుమతి

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త : దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెరగడంతో, విదేశీ బొగ్గు దిగుమతుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. విదేశాల నుండి 5.83 శాతంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ మేరకు బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దేశం యొక్క మొత్తం బొగ్గు దిగుమతులు ఆగస్టు 2025లో 111.05 మిలియన్ టన్నుల నుండి ఆగస్టు 2026లో 104.57 మిలియన్ టన్నులకు 5.83 శాతం మేర తగ్గాయి. ఇది 6.48 మిలియన్ టన్నుల తగ్గుదలగా నమోదైంది. అలాగే విద్యుత్ ప్లాంట్ల ద్వారా బొగ్గు దిగుమతులు 6.39 శాతం మేర తగ్గాయి. 2025 ఆగస్టులో 22.77 మెట్రిక్ టన్నులుగా ఉన్న ఈ దిగుమతులు, ఈ ఏడాది అదే సమయానికి 21.32 మెట్రిక్ టన్నులకు పడిపోయాయి. అయితే దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల దిగుమతులు స్వల్పంగా పెరుగుదల చోటు చేసుకుంది. సంబంధిత విద్యుత్ ప్లాంట్ల ద్వారా బొగ్గు దిగుమతులు గత ఏడాది ఆగస్టులో 18.13 మెట్రిక్ టన్నుల నుండి ఈ ఏడాది అదే కాలానికి 18.31 మెట్రిక్ టన్నులతో 0.98 శాతం మేర స్వల్పంగా పెరుగుదల నమోదైంది. ఈ ప్లాంట్లు ప్రధానంగా దిగుమతి చేసుకున్న బొగ్గుతో పనిచేసేలా రూపొందించబడ్డాయి. దేశీయ బొగ్గు లభ్యతను మెరుగుపరచడానికి, అలాగే దేశీయ బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో మిశ్రమం కోసం దిగుమతి చేసుకున్న బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు అనుగుణంగానే ఈ తగ్గుదల ఉంది. దిగుమతి చేసుకున్న బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో, దేశీయ బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి, లభ్యతను మెరుగుపరచడానికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఈ తగ్గుదల ప్రతిబింబిస్తుంది.

రాష్ట్రవ్యాప్తంగా 1,435 పోలీసు సిబ్బందికి పదోన్నతుల శిక్షణ

మేడ్చల్ పిటిసి శిక్షణకు హాజరైన అదనపు డిజి అకున్‌సబర్వాల్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: పోలీసు శాఖలో సివిల్, సాయుధ బలగంలో కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఎఎస్ఐలుగా పనిచేస్తున్న 1,435 మంది సిబ్బందికి పదోన్నతులకు సంబంధించిన శిక్షణ సోమవారం రాష్ట్రంలోని మూడు పోలీసు శిక్షణా కళాశాల (పిటిసి)ల్లో మొదలైంది. వీరిలో 899 మంది సివిల్ విభాగం, 536 మంది సాయుధ బలగానికి చెందిన వారున్నారు. సివిల్ విభాగంలో మేడ్చల్ పిటిసిలో 586 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతుల శిక్షణ ప్రారంభించారు. కరీంనగర్ పిటిసిలో 313 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు ఎస్సైలు, ఎస్ఐలుగా పదోన్నతుల శిక్షణ ప్రారంభమయ్యింది. సాయుధ బలగంలో వరంగల్ పిటిసిలో 302 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, 176 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఆర్ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ప్రారంభమైంది. కరీంనగర్ పిటిసిలో మరో 58మంది ఏఆర్ఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ మొదలయ్యింది. కాగా మేడ్చల్ పిటిసిలో జరిగిన కార్య క్రమానికి సాంకేతిక సేవలు, శిక్షణ విభాగం అదనపు డిజిపి డాక్టర్ ఆకున్ సబర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పోలీసు సిబ్బందికి పదోన్నతుల శిక్షణ నిరంతర ప్రక్రియ అని, దీనివల్ల ఉన్నత హోదాల్లో బాధ్యతలు చేపట్టనున్న సిబ్బందికి వృత్తిపరమైన పరిజ్ఞానం, విధినిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యమని ఆయన తెలిపారు.



మేడ్చల్ పిటిసిలో సిబ్బంది పదోన్నతులకు సంబంధించిన శిక్షణకు హాజరై ప్రసంగిస్తున్న అదనపు డిజి ఆకున్‌సబర్వాల్

రాష్ట్రాలకు కేంద్రం దీపావళి గిఫ్ట్

తెలంగాణకు భారీగా రూ.2,370 కోట్లు విడుదల

ఉత్తరప్రదేశ్‌కు ఏకంగా రూ.19,208 కోట్లు

రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక శాఖ ముందస్తు పన్నుల వాటా

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: పండుగల వేళ అభివృద్ధి, సంక్షేమ పనులకు ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు దీపావళి గిఫ్ట్ ఇచ్చింది. పన్నుల వాటా పంపకం కింద రాష్ట్రాలకు చేరాల్సిన నిధుల్లో ఒక అడ్వాన్స్ ఇన్‌స్టాల్‌మెంట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం విడుదల చేసింది. ఈ ప్యాకేజీలో భాగంగా సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు గణనీయమైన వాటా లభించింది. ఈ తాజా కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి పన్నుల వాటా రూపంలో రూ. 2,370 కోట్లు విడుదలయ్యాయి. మరోవైపు ఆంధ్ర ప్రదేశ్‌కు రూ.4,597 కోట్లు అందాయి. ఇక దేశంలోనే అగ్రస్థానంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు అత్యధికంగా నిధులు విడుదల చేసిన కేంద్రం వాటికి భారీ ఊరట కలిగించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు నిధులు కేటాయించగా, అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు ఏకంగా రూ.19,208 కోట్లు విడుదలయ్యాయి. ఆ తర్వాత బిహార్‌కు రూ.10,845 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.8,010 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.7,866 కోట్లు దక్కాయి. ఇక పశ్చిమ భారతంలో కీలకమైన మహా రాష్ట్రకు రూ.7,022 కోట్లు లభించాయి. దక్షిణాది రాష్ట్రాల విడుదలైన నిధులు చూస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్ణాటకకు రూ.4,504 కోట్లు, తమిళనాడుకు రూ.4,466 కోట్లు, కేరళకు రూ.2,597 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసేందుకు ఈ ముందస్తు పంపిణీ అత్యంత ప్రయోజనకారికంగా ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా పండుగ సీజన్‌లో రాష్ట్రాల ఖజానాపై ఆర్థిక భారం పడకుండా, క్యాపిటల్ వ్యయం, వివిధ సంక్షేమ పథకాలను వేగవంతం చేసేందుకు ఈ అడ్వాన్స్ ఫండ్స్ ఎంతో సహాయ పడనున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అమిత్‌షాతో చిరంజీవి భేటీ

ఎఐ డీప్‌ఫేక్, మార్ఫింగ్ సమస్యపై కేంద్రమంత్రికి వివరించిన వైనం

కఠిన చట్టాలు తెస్తామని, కఠినచర్యలు తీసుకుంటామని అమిత్‌షా హామీ

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: బిజెపి అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, ఆయన కుమారుడు రాంచరణ్ ఆయనతో సమావేశమయ్యారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను, బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు కలిశారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ఓ తీవ్రమైన సమస్యను చిరంజీవి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏఐ టెక్నాలజీని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్, మార్ఫింగ్ ద్వారా అసభ్యకరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారని, దీనివల్ల కళాకారులు, ముఖ్యంగా నటీమణులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని వివరించారు. టాలీవుడ్‌తో పాటు యావత్ భారత సినీ పరిశ్రమ తరఫున ఈ సమస్యపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు. చిరంజీవి చెప్పిన విషయాలను అమిత్ షా సావధానంగా విన్నారు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి కళాకారులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠినమైన మార్గదర్శకాలు, శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు, ఈ విషయంపై పూర్తి వివరాలతో లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి అమిత్ షా సూచించారు. దీనికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించడంపై చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకునే చర్యలతో చిత్ర పరిశ్రమకు త్వరలోనే ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ భేటీలో చిరంజీవి అమిత్ షాను శాలువాతో సత్కరించి, మెమొంటోను బహూకరించారు. కాగా, ముందుగానే అప్పాయింట్‌మెంట్ ఉండటంతో చిరంజీవి, ఆయన తనయుడు రాంచరణ్....కేంద్ర మంత్రి అమిత్ షాను కలిశారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో ఆదివారం ఓట్ బచావో-దేశ్‌కో బచావో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి వెళ్లారు. అయితే చిరంజీవి కార్యక్రమానికి వెళ్లకపోవడంతో ఆయన కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నారన్న సంకేతం ఇచ్చినట్లేనని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. ఇప్పుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవడం వెనుకా రాజకీయ వ్యూహం ఉంటుందన్న అభిప్రాయాన్ని బీజేపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడం, ఇతర కారణాల వల్ల కేసు మళ్లీ పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఎప్పుడైనా కేసు కొట్టివేస్తే ఉప ఎన్నిక జరుగుతుందన్న నమ్మకంతో బీజేపీ నాయకులు ఉన్నారు. అందువల్ల ఉప ఎన్నికలో ప్రచారం కోసం చిరంజీవిని ఆహ్వానించవచ్చని పార్టీ భావిస్తున్నారు. ఇక.. గతంలోనూ చిరంజీవి, రామ్‌చరణ్ అమిత్ షాను కలిసిన సందర్భాలు ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించిన తర్వాత చిరంజీవి, రామ్‌చరణ్ స్వయంగా ఢిల్లీకి వెళ్లి.. అమిత్ షాను కలిశారు. ఆ సమయంలో భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై అమిత్ షా వారిని అభినందించారు. ఇప్పుడు మరోసారి హైదరాబాద్‌లో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. కాగా. ఇదే సమయంలో జూపల్లి (మైహోం) రామేశ్వర్ రావు తదితరులు అమిత్‌షాను కలిసినట్లు సమాచారం.



సోమవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైన మెగాస్టార్ చిరంజీవి, రాంచరణ్

పోలీసు సిబ్బంది సంక్షేమానికి, సమర్థతకు మౌలిక వసతులు కీలకం

యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో గ్యాస్ గోదాం ప్రారంభించిన శాంతిభద్రతల డిజి మహేశ్‌భగవత్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: పోలీసు శాఖ సమర్థంగా పని చేయడానికి అధునాతన మౌలిక వసతులు ఎంతో అవసరమని శాంతి భద్రతల డిజి మహేశ్‌భగవత్ అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని నాణ్యమైన నివాస, కార్యాలయ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని ఆయన పేర్కొన్నారు. నగరంలోని యూసుఫ్ గూడలో గల రాష్ట్ర ప్రత్యేక పోలీసు (టీజీఎస్పీ) మొదటి బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన అసిస్టెంట్ కమాండెంట్ క్వార్టర్స్, ఆధునికీకరించిన గ్యాస్ గోదాంను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో బెటాలియన్ల విభాగం ఎంతో కీలకంగా వుందని అన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో స్థానిక పోలీసులకు ఈ విభాగం నిరంతరం వెన్నుదన్నుగా నిలిచిందని ఆయన కొనియాడారు. నిరంతరం చురుకుగా వుండే ఈ విభాగం సిబ్బంది పనితీరు ఎల్లవేళలా ఆమోఘంగా వుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బెటాలియన్ లోని వివిధ అంతస్తులు, కల్పించిన మౌలిక వసతు లను టీజీఎస్పీ బెటా లియన్ల అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్ వివరించారు. అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారో త్సవాల్లో భాగంగా నిర్వ హించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన చిన్నారులకు మహేశ్ భగవత్ బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్ర మంలో బెటాలియన్ల డిఐజి మురళీకృష్ణ, మొద టి బెటాలియన్ కమాం డెంట్ కె.వీర య్య, ఎనిమిదవ బెటాలియున్ కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి, అదనపు కమాం డెంట్ కె.పి.శరత్ కుమార్‌తో పాటు పలు వురు పోలీసు అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడ పోలీసు బెటాలియన్‌లో గ్యాస్ గోదాము ప్రారంభిస్తున్న శాంతిభద్రతల డిజి మహేష్‌భగవత్. చిత్రంలో బెటాలియన్ల అదనపు డిజి సంజయ్‌కుమార్ జైన్ తదితరులు

వరుస ఓటములతో కాంగ్రెస్ పార్టీలో నైరాశ్యం

అరాచక మార్గాల్లో అధికారం కోసం ప్రయత్నిస్తోంది

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కేంద్రమంత్రి అమిత్‌షా పిలుపు

పాదయాత్రకు ముందు కాంగ్రెస్‌పై ఆసక్తికర పోస్ట్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: వరుస ఎన్నికల ఓటములతో కాంగ్రెస్ పార్టీ నైరాశ్యంలో కూరుకుపోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారం లోకి రావడం సాధ్యం కాకపోవడంతో అరాచక మార్గాల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం) మహా పాదయాత్రలో తాను పాల్గొంటున్న విషయాన్ని పాదయాత్రం ప్రారంభం కాక ముందు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బీజేపీ వర్గాలు చెప్పాయి. ఈ పాదయాత్రలో అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ బీజేపీ నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పాదయాత్ర ముగిసిన తర్వాత నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీపై మరిన్ని విమర్శలు చేశారు. ఆయన ప్రసంగంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

గ్రీన్ క్రాకర్లు మాత్రమే వినియోగించాలి

ఉదయం గంట, రాత్రి రెండు గంటలే కాల్చేందుకు అనుమతి

సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 2: ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో గ్రీన్ టపాసుల కాల్చుకోవడానికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. 2025 అక్టోబర్ 15నాటి తన పూర్వపు ఆదేశాలకు అనుగుణంగా, 2026 నవంబర్ 7, 8 తేదీల్లో నిర్ణీత సమయాల్లో మాత్రమే టపాసులు కాల్చుకోవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అది కూడా ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమేనని సూచించింది. నిర్ణీత సమయాలు దాటిన తర్వాత లేక ముందు టపాసులు కాల్చడం చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాలు, వృద్ధాశ్రమాలు, విద్యాసంస్థలు, అధికారికంగా ప్రకటించిన సైలెన్స్ జోన్లకి 300 మీటర్ల పరిధి లోపల ఎలాంటి టపాసులు కాల్చకూడదని సుప్రీం ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాంతాలను నోక్రాకర్ జోన్లుగా ప్రకటించి, ప్రజలకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక బోర్డులు, గుర్తులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. అదేవిధంగా కేవలం నిపుణుల కమిటీ ఆమోదించిన గ్రీన్ క్రాకర్లను మాత్రమే విక్రయిం చాలి. క్యూఆర్ కోడ్ కలిగిన ప్రామాణిక గ్రీన్ టపాసుల పెట్టెలనే వ్యాపారులు విక్రయించాలి. నిషేధిత, ప్రమాదకర రసాయనాలు ఉన్న బాణసంచా అమ్మకాలపై కఠిన చర్యలు ఉంటాయి. ఆన్‌లైన్ ఇకామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోకి టపాసుల డెలివరీలను పూర్తిగా నిషేధించారు. స్థానిక పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు ఈ నిబంధనలు అమలవుతు న్నాయో లేదో నిరంతరం పర్యవేక్షిస్తాయని కోర్టు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లం ఘించిన వారిపై అలాగే అక్రమంగా టపాసులు విక్రయించే వారిపై చట్ట పరమైన కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించనున్నారు.



కేంద్రమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటనవేళ పటిష్ఠ భద్రత

పోలీసు పహారాలో బేగంపేట్ విమానాశ్రయం

అన్నిచోట్ల గ్రీన్‌ఛానల్ ఏర్పాటు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన వేళ సోమవారం నగరంలో అసాధారణ భద్రతను ఏర్పాటు చేశారు. నాలుగు గంటలపాటు అమిత్‌షా హైదరాబాద్‌లో పర్యటించగా ఆయన పర్యటన సాగిన ప్రాంతాలలో అ డుగడుగునా పోలీసులు మొహరించారు. మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో అమిత్ షా ప్రత్యేక విమానంలో బేగంపేట్ విమానాశ్రయా నికి రాగా అక్కడ ఆయన బిజెపి నేతల నుంచి ఘన స్వాగతం అందుకుని నేరుగా చార్మినార్ వద్ద గల భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకుని ఏడు నిమిషాల పాటు గడిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేగంపేట్‌లోని ఐటిసి కాకతీయ హోటల్‌కు చేరుకుని పార్టీ నేతలతో కలిసి భోజనం చేశాక బషీర్ బాగ్ చౌరస్తాలోని బాబు జగజీవన్ రాం విగ్రహం నుంచి మోజంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర నిర్వహించారు . అబిడ్స్ మీదుగా సాగిన ఈ పాదయాత్ర కోసం నగర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు కూడా బందోబస్తు నిర్వహించాయి. అమిత్ షా జ డ్ ప్లస్ భద్రత కలిగిన నాయకుడు అవడంతో సిటీ పోలీసులు కూడా అందుకు తగినట్లుగానే ఆయనకు భద్రతా సిబ్బందిని నియమించారు. గత ంలో హైదరాబాద్‌లో బిజెపి నాయకులను, సంఘ్ పరివార్ నాయకులను ఐఎస్ఐ ఉగ్రవాదులు టార్గెట్ చేసిన ఉదంతాలు వుండడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వుండేందుకు కీలక ప్రాంతాలలో సాయుధులను, కమెండోలను మొహరించారు. మోజం జా హీ మార్కెట్ చౌరస్తా వద్ద సమావేశం తరువాత అమిత్ షా పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన సాయంత్రం ఐదు గం టల 20 నిమిషాల సమయంలో బేగంపేట్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి పయనమయ్యారు. కాగా అమిత్ షా రాక పోకల నేపథ్యంలో ఆయన ప్రయాణం సాగించిన మార్గాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ గ్రీన్ ఛానల్ ఏ ర్పాటు చేసింది. మరోవైపు అమిత్ షా పర్యటన పురస్కరించుకుని బేగంపేట్ విమానాశ్రయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రక్షణ శా ఖకు సంబంధించిన ఎలాంటి విమానాలకు అను మతి ఇవ్వలేదు. విమానాశ్రయం లోపల బయట ఉదయం నుండి పోలీసులు భారీ ఎత్తున మొహరించారు. బేగంపేట్ విమానాశ్రయం కేవలం రక్షణ శాఖ విమానాలతో పాటు ప్రముఖుల విమానాల రాకపోకలకు మాత్రమే వాడుతుండడ ం తెలిసిందే. అమిత్ షా పర్యటన నేపథ్యంలో సో మవారం నాడు ఇద్దరు ప్రముఖుల హైదరాబాద్ పర్యటనలకు పౌర విమానాయన శాఖ అనుమతులు నిరాకరించినట్లు తెలిసింది.

మూడు గంటల్లోనే హత్య కేసు ఛేదన

రూ.1.73 కోట్ల సొత్తు స్వాధీనం


మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్

నిర్మల్ జిల్లా టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు

చౌటుప్పల్, నవంబరు 2, ప్రభాతవార్త: పూజారి దారుణ హత్య.. మరోవైపు భారీ చోరీ.. నిందితులు బంగారం, వెండి, నగదుతో పాటు కారులో పరారయ్యారు. అయినా పోలీసుల నిఘా నుంచి తప్పించుకోలేకపోయారు. పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన పోలీసులు కేవలం మూడు గంటల్లోనే కేసును ఛేదించి, నిందితులను పట్టుకోవడంతోపాటు రూ.1.73 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్‌లో కలకలం రేపిన పూజారి రాళ్లబండి సుధాకర్ స్వామి హత్య, చోరీ కేసులో పోలీసుల వేగవంతమైన దర్యాప్తు కీలకంగా మారింది. అక్టోబరు 31 అర్ధ రాత్రి చౌటుప్పల్ పట్టణంలో సుధాకర్ స్వామిని హత్య చేసిన నిందితులు ఆయన ఇంట్లోని బంగారం, వెండి, నగదు దోచుకుని టాటా సఫారీ కారులో పరారయ్యారు. సమా చారం అందుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి, నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. మధ్యప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్, హర్ష్ సంతోష్ పాండేలను ఆదివారం ఉదయం నిర్మల్ జిల్లా గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఛేజ్‌చేసి అదుపులోకి తీసు కున్నారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ సోమవారం చౌటుప్పల్ డీఎస్పీ కార్యా లయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.30 కోట్ల విలువైన 1.319 కిలోల బంగారం, రూ.3.60 లక్షల విలువైన 3.600 కిలోల వెండి, రూ.9.03 లక్షల నగదు, టాటా సఫారీ కారు, ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ రూ.1.73 కోట్లుగా పేర్కొన్నారు. కేసును వేగంగా ఛేదించ డంలో చాకచక్యంగా వ్యవహ రించిన చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ సతీష్ రెడ్డి, ఎస్సైలు, సాంకేతిక బృందం, నిర్మల్ జిల్లా పోలీ సులను ఎస్పీ అక్షాంశ్‌యాదవ్ అభినందించారు.

కొత్తగా 100 బిసి కాలేజ్ హాస్టళ్లు, 150 గురుకులాలు మంజూరు చేయాలి

ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త : రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల హాస్టల్స్‌కు విపరీతమైన డిమాండ్ ఉందని, తక్షణమే కొత్తగా 100 బీసీ కాలేజ్ హాస్టల్స్, 150 బీసీ గురుకులాలు, 100 ఎస్సీ హాస్టల్స్, 50 ఎస్టీ హాస్టల్స్ మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 18 సంవత్సరాల క్రితం నాటి జనాభా ప్రాతిపదికన ఉన్న హాస్టల్స్‌ను, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సీట్లు లభించక వేలాది మంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో ఫీజులు భరించలేక చదువు మానుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బీసీ గురుకుల పాఠశాలల అడ్మిషన్లకు లక్షలాదిగా దరఖాస్తులు వస్తున్నాయని, 99 శాతం ఫలితాలు రావడంతో డిమాండ్ మరింత పెరిగిందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో వర్కర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు.

వార్త

సాహసవంతులు ఉన్నంతవరకే
దేశం స్వతంత్రంగా మనగులుగుతుంది.

న- ఇ. డేవిస్

'మురసు' ముప్పిరిగొన్న వేళ!

మిన్ను విరిగి మీదపడినా చలించని అన్నదాత నిన్న మొన్నటి అర్నబ్, నేడు వస్తుందని ఎదురుచూస్తున్న 'మురసు' తుఫాను ఊసులు విని ఒక్కసారిగా నేలకొరిగిపోతున్నాడు. ఏ సీజన్‌లో ఆ సీజన్ పండే పండ్లు, ఫలాలు, తృణధాన్యాలు, ధాన్యాలు, వగైరా పంటల సాగుపై కేంద్రీకృతం చేయడం రైతు నిత్యకృత్యం. ప్రకృతి బీభత్సాలకు ఏనాడూ తొణకలేదు, బెణకలేదు. కానీ గత రెండేళ్లుగా వరుసగా వస్తున్న తుఫానులకు బెదిరిపోతున్నాడు. ఇప్పటికే అర్నబ్ విధ్వంసంతో తెలుగు రాష్ట్రాలు కకావికలయ్యాయి. నష్టంచూస్తే రైతు బావురుమంటున్నాడు. పంటల బీమా పథకం ఉన్నా ఆయా ప్రభుత్వాల నిర్వాకం వలన ఏమేరకు నష్టపరిహారం వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోనైతే ఏ రైతుకారైతు తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పంట మేరకు బీమా చేయించుకుని ప్రీమియంలు కట్టారు. ఉన్న పరిస్థితులను బట్టి పంటల బీమాను మండల ప్రాంత ప్రాతిపదిక మీద ప్రభుత్వాలే ప్రీమియంలు కట్టాలి.కానీ అలా జరగలేదు. ఆనాటి నష్టం నుంచి తేరుకోకముందే మళ్లీ తుఫాను ప్రధానంగా "కోస్తా" రైతును చాచికొట్టింది. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయి. తెలంగాణలో రైతును దుస్థితి నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడం లేదనే విమర్శతో విపక్షనేత ఓ నినాదాన్ని తాజాగా చేపట్టారు. గతం కన్నా ఎక్కువ పత్తి దిగుమతులు పండించగలిగినా సిసిఐ ద్వారా గిట్టుబాటు ధరతో కొనిపించేందుకు కేంద్రప్రభుత్వ అధినేత ప్రధానికి మనసురావటల్లేదన్నది వారి ఆరోపణ. అలాగే వరి ధాన్యం, సోయా, ఉత్పత్తులను కొనుగోలు చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కలిసిరావట్లేదని, ఇలాప్రభుత్వాలు రైతుల ఆక్రందనలు పట్టించుకోవట్లేదని వారి ఆవేదన. తాజాగా సోమవారం నుంచి 4వ తేదీ వరకు 'మురసు' తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని వివిధ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు మళ్లీ రైతుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. తెలంగాణలో వరి, పత్తి పంటలువివిధ దశల్లో అనగా కోత సమయానికి చేరువలోనూ పూతకు ముందు దశలోనూ ఉన్నాయి. నీటి సంరక్షణ ఎంతోకష్టం. కనీసం 'అర్నబ్' ప్రభావానికి పాడైన వరి పొలాల నుంచి నీటిని బయటకుతోడాలంటే కూలీలకు బాగా ఖర్చవుతుంది. తోడకపోతే కుళ్లిపోతుంది. తోడితే రేపటి 'మురసు' నీటికి మళ్లీ నిండిపోతాయి. ఏదైనా మునిగిపోవడమే. ఇలా ఏం చేయాలో దిక్కుతోచని తెలియని పరిస్థితి రైతుది. వరికంకులు మొన్నటి వర్షానికి తడిసి నేలవాలాయి. వాటి కోతకు యంత్రాలను తీసుకుంటే అదోఖర్చు. వెరసితడిసిమోపెడు. తడిసిన పంట ఆరబెడితేకానీ అమ్మకానికి పనికిరాదు. ఆరుదలతో కొంత నాణ్యత తగ్గుతుంది. బరువు తగ్గుతుంది. ఇక విక్రయమంటారా? దైవాధీనం. కొన్ని పంటలకు ఇప్పుడు మంచి ధర పలుకుతోందని సంబరపడిన సమయంలో తుఫాను దెబ్బతో రైతు ఖిన్నుడైపోయాడు. గతంలో వరి ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కి రూ.2,900 ఉండేది. నాణ్యమైన బియ్యానికి రూ.500 సబ్సిడీ కూడా అందేది. ఇప్పుడా పరిస్థితులు మారిపోయాయి. పత్తి దిగుబడులకు ఇదే పరిస్థితి ఎదురౌతోంది. దాదాపు పంటలన్నీ పూత దశ నుండి కంకిదశ వరకు వివిధ దశలలోఉన్నాయి. ఈనేందుకు వీలుకాక చలిగాలులకు, వానలకు మధ్యనచిక్కి దిగుబడులు తగ్గే ప్రమాదముంది. రాబోయే 'మురసు' తాకిడి మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలకు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.ఇప్పుడున్న పరిస్థితుల్లో వరి దిగుబడులను కొంతలో కొంతైనా దక్కించుకోవచ్చునని రైతు ఆశపడుతుండగా, రేపటి వానకు పంటలు తడిస్తే కంకులు నీట రాలిపోయి పొలాల్లో మొక్కమొలిచి పాడైనా ఆపలేము. వాటి సంరక్షణకు మళ్లీ ఓ వరికోత ప్రక్రియకు సిద్ధమవ్వాల్సిందే.ఈసారి వరికోత యంత్రాల ఖర్చు అమాంతం మింగేస్తుంది. అలా ఎకరాకు రూ.3వేల రూపాయల మేరకు ఖర్చుఎదురు చూస్తుంది.ఇక మిాదట మిగిలే గింజలు ఎన్ని? వచ్చే ఆదాయమెంత? అని చూసుకుంటే 'రైతుకు ఏమాత్రం' గిట్టుబాటు లేక తలపట్టుకోవాల్సిందే. 'అర్నబ్' తుఫాన్ దెబ్బకు ఉత్తరాంధ్ర నుంచి గోదావరి జిల్లాలవరకు పంటలు నీటమునిగి కూడిరానినష్టం జరిగింది. ప్రాణనష్టం అతి తక్కువే అని సంబరపడటమే తప్ప రైతుకు కాస్తయినా భరోసా దొరకలేదు. నదీ పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరదనీరు చేరడంతో రైతులు పంటనష్టాన్ని లెక్కించడమూ సాధ్యంకావడం లేదు. 'మురుసు' తుఫానుతో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. వరి, పత్తి, మిరి, ఉద్యాన పంటల పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా కాలువలను సిద్ధం చేసుకోవడమొక్కటే తరుణోపాయం అని వ్యవసాయ శాఖ చెబుతోంది. వాతావరణ పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చేవరకు పంటకోతలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియోగాన్ని ఆపేయాలి.బలమైన గాలులు, పిడుగులు పడే సమయానికి రైతుపొలాల్లోకి వెళ్లరాదు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదు. ఇవన్నీ వ్యవసాయదారునికి వ్యవసాయశాఖ చేసే హెచ్చరికలు.రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా ఆ శాఖ హెచ్చరికలు పాటించడం మేలు. ఇప్పటికే వరుస తుఫానులు చవిచూసిన 'కోస్తా తీరం'మరో విపత్కర పరిస్థితులనుఎదుర్కొంటున్నందున వ్యవసాయ, ఉద్యానవన,పశుసంవర్ధక,మత్స్య శాఖలు అప్రమత్తమైంది. రైతుకు దిక్కుతోచని పరిస్థితి తలెత్తకుండా చూడాలి. ఈసారి 'మురుసు' తుఫాను మంగళవారం ఉదయం నెల్లూరు, నరసాపురం మధ్యదక్షిణ కోస్తాలో తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఒకపక్క'మురసు' ఫ్లాష్‌ఫ్లడ్స్‌ను తెస్తుందని చెప్పుకుంటున్నా అర్నబ్ కన్నా తక్కువ ప్రభావమే ఉంటుందని అంచనా. పొంచి ఉన్న మరో తుఫాను ముప్పును ఎదుర్కోవడానికి సర్వసన్నద్ధమవడమంటే మంచి పరిణామం.


దేశం అవిచ్ఛిన్నంగానే అడుగేస్తుంది!

ఈ ప్రభుత్వం నాదీ అన్న భావన రాష్ట్రాలలోని ప్రజలకు వచ్చినప్పుడే ఫెడరల్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిధిలో ఆమోదయోగ్యంగా వుంటుంది. అది లేని నాడు ఇతర దేశాల మాదిరి అనవసరపు అంతర్గతసమస్యలకు తావిచ్చినట్లవుతుంది. అదృష్ట వశాత్తు మన ప్రజలూ ప్రభుత్వాలూ, ప్రతిపక్షాలూ అంత దూరం పోనివ్వరని సామాన్యులు అనుకుంటున్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేక! ఆ ప్రత్యేకతను అధికారం అన్నివేళలా నిలుపుకోటానికి రాజకీయ పార్టీలు గిమ్మిక్కులు డీలిమిటేషన్ రూపంలో చేస్తాయని ఎవరూ భావించటం లేదు! ప్రధాని మోడీనాయకత్వంలో ఎన్.డి.యే కూటమి మన దేశానికి అంతర్జాతీయ పరిధిలో, క్లిష్ట సమయంలో కూడా అన్ని దేశాలూ ఆశ్చర్యపడే రీతిలో స్థిరమైన ప్రజాస్వామ్యంగా నిరూపించుకున్నది! 'ఎమర్జెన్సీ' తప్పుని ఒడి పోవటానికి సిద్ధపడిన పార్టీ కాంగ్రెసు, ఎన్నో సంవత్సరాలు దేశాన్ని ఒడిదుడుకులకు లోనుకాకుండా నడపగలిగింది! అందుకనే భారత్‌లోని ప్రజలు శక్తియుక్తులతో ప్రభుత్వాలను ఎంపిక చేస్తున్నారు!



రావులపాటి సీతారాంరావు

ప్రజాస్వామ్యంలో చర్చలు, డిబేట్లు నిరంతరం కొన్ని జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుండా వున్నప్పుడు పాలకులు ప్రతిపక్షాలతో, ప్రముఖులతో, మేధావులతో, అన్ని రంగాల నిపుణులతో విస్తారంగా కొనసాగిస్తూనే వుండాలి! అరమరికలు లేకుండా, ఒకరినిమించి మరొకరు పాయింట్స్ స్కోరు చేయటానికి కాకుండా పారదర్శకంగా, మీడియా సాక్షిగా ఛానెళ్ళలో ప్రసారమయ్యే రీతిలో సామాన్యులకు గూడా దేశాన్ని పాలించే వారితో పాటు, రాజకీయ నాయకులు అందరూ పాల్గొని ఒక సమస్య మీద డిబేట్ చేయగలుగుతే, సాధ్యమైనరీతిలో అందరి ఆమోదం సాధించలేకపోయినా మెజార్టీ అభిప్రాయాన్ని పొందగలుగుతే, ఆ సమస్య పరిష్కారం సులువుగా మారుతుంది! సోషల్ మీడియా వల్ల అనేక ప్రయోజనాలు వున్న మాట వాస్తవం. సమాచారం సులువుగా అందరికీ అందుబాటులో వుండటానికి సోషల్ మీడియా దోహదం చేస్తున్నది. అయితే ఈ వ్యవస్థ రాజకీయ నాయకులే ననకాకుండా ఇతర స్వప్రయోజనపరుల చేతుల్లోకి పోకుండా, సమాచారాన్ని యధారీతిలో మీడియాతో పాటు చేరవేయగలుగుతే అంతకంటే కావల్సిందేమున్నది! బేధాభిప్రాయాలతో పాటు, సమస్య మూలాలు, పరిష్కారానికి ఇబ్బందులు తెలుసుకోగలగటంతో ఎవరో నవ్వుతూ చెప్పినట్లు బాల్ అందరి కోర్టులో పడ్డట్లు అవుతుంది. సామాన్యుడు గూడా ఆ చిక్కు సమస్యను 'ఓన్' చేసుకొని పరిష్కార దిశగా అడుగులు వేసే ప్రయత్నం కల్పించబడుతుంది! కొంచెం ఆలస్యమైనా ప్రతి సమస్య పూర్వాపరాలు తెలియటం వల్ల ఏది మంచో ఏది చెడో ఎక్కువ మంది ప్రజలకు అంతుపట్టే అవకాశం లభ్యపడుతుంది! ఈ ప్రక్రియ నిజానికి ప్రజాస్వామ్య పునాదులను మరింతగా బలపరుస్తుంది!ప్రతిపక్షం అందరం అన్ని పార్టీలు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ డీలిమిటేషన్ సమస్యను కూలంకషంగా చర్చించి ఒక నిర్ణయం సమిష్టిగా తీసుకుందాం అని ప్రభుత్వాన్ని, ఖర్గే కాంగ్రెసు అధ్యక్షుడు కోరుకోవటంలో తప్పుపట్టాల్సిన పని లేదు! దాదాపు నాలుగైదు సార్లు లేఖల ద్వారా ఈ కోరికను పాలకులకు అందజేసాడు కానీ ప్రధాని పెద్దగా ప్రతి స్పందించలేదు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాత్రం, అనేకసార్లు ప్రభుత్వం, కాంగ్రెసు పార్టీ సహకారం ఈ సమస్య విషయంలో కోరటం జరిగింది. అదే విధంగా ఇతర ప్రతిపక్షాలను గూడా కోరాం! అంతవరకే ఆయన సమాధానం ఇచ్చారు కానీ ఖచ్చితమైన ప్రతిపాదనలు, డీలిమిటేషన్ సమస్య మీద వున్నాయి మా ప్రభుత్వం దగ్గర అన్న రీతిలో జవాబు ఇవ్వక పోవటంతో అఖిలపక్ష సమావేశం జరగనే జరగలేదు. అయితే రిజిజు రాసిన లేఖలో డీలిమిటేషన్ విషయంలో చట్టం తెస్తాం అని మాత్రమే రాసారు కానీ ఇతర వివరాలు ప్రజల్లో డిబేట్ కోసం ఏ మాత్రం బహిర్గత పర్చలేదు! అదీ వాస్తవంగా డీలిమిటేషన్ పైన వున్న ప్రస్తుత పరిస్థితి! డీలిమిటేషన్ విషయాన్ని, మహిళా రిజర్వేషన్ సమస్యతో ముడిపెట్టటంతో పరిస్థితి పరిష్కారం విషయంలో జటిలమైంది! ఈ సమస్య ఎన్నో సంవత్సరాల నుంచి ఎక్కడ వేసిన గొంగళి మాదిరే వుంది! డీలిమిటేషన్ చట్టంతో ఆ విషయాన్ని జత కల్పటంతో,



పాలకులు ఏ దిశగా ఆలోచిస్తున్నారో మేధావులకూ రాజకీయ విశ్లేషకులకూ అవగతమైంది! నిజానికి మహిళా రిజర్వేషన్ల విషయంలో, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 1/3వంతు సీట్లు మహిళల కోసం రిజర్వ్ చేయాలనే విషయం తదుపరి డీలిమిటేషన్లో జరుగుతుంది అన్నది నిర్ణయం తీసుకున్న విషయంగా వున్నప్పుడు అదీ డీలిమిటేషన్ వల్ల సీట్లుపెరిగే విషయంలో ముడిపెట్టి పేచీ పెట్టాల్సిన సమస్య కానేకాదు! నిజమైన సమస్యల్లా లోక్‌సభలో ఎన్ని సీట్లు పెరుగుతాయి, ఏవిధంగా రాష్ట్రాల మధ్య అవి పంచబడ్డాయన్నదిమాత్రమే! కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ సీట్లు 850కి పెంచబడినప్పుడు, మహిళలకు పెంచిన సీట్లు రిజర్వ్ చేయటం జరుగుతుం దని, రాష్ట్రాలలో వున్న శాతాన్ని తగ్గనీయకుండా వుంచే ఏర్పాటు వుంటుందని చెబుతున్నది! వీలుంటే 50 శాతం రిజర్వేషన్లు పెంచవచ్చు అన్న సంకేతం గూడా స్పష్టత లేకుండా ఇస్తుండటం గమనార్హం! తర్వాత కేంద్ర ప్రభుత్వం 2011 సెన్సెస్‌ను అనుసరించి లోక్‌సభ సీట్లు పంచాలన్న బిల్లును ప్రవేశపెట్టడంతో అనేక అనుమానాలూ, సందేహ లూ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో బయటపడటం అందరూ గమనించారు! చెప్పిన విధంగా కేంద్రం చేయటం లేదన్నది రాజకీయ పక్షాలలో చర్చనీయాంశంగా మారింది! అందువల్లే 'బిల్లు' ముందుకు పోలేదు. బిల్లు పెట్టబోయే ముందు చెప్పిన విషయాలకు, బిల్లు పెట్టిన తర్వాత అందు లో వున్న అంశాలకు పొంతన లేకపోవటంతో బిల్లుకు చల నం లేకుండా పోయింది! బిల్లు ఆమోదించబడాలంటే 850 సీట్లకు లోక్‌సభలో పెంచుతే దానిని రాష్ట్రాల శాసన సభల్లో ప్రతిబింప చేయటానికి రాజ్యాంగ సవరణ అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్య ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెసు 543 సీట్లు (ప్రస్తుతం పరిస్థితి) కే అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్రాల శాసన సభలలో వున్న సంఖ్యకే కట్టుబడి వుండాలని కోరుతున్నది. రాష్ట్రాలలోని పార్టీల తీరుతెన్నులు ప్రక్కన పెట్టి ఈవిషయాన్ని విశ్లేషిస్తే, ప్రతి రాష్ట్రం కేంద్రంలో తన పలుకుబడి ఎక్కువ సీట్లు వుంటేనే సాధ్యపడుతుందని భావిస్తున్నది! అది నిజం గూడా!ఉదాహరణకు అవిభక్త ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు తన లోక్‌సభ సీట్లతో కేంద్రాన్ని ఏ విషయంలోనైనా ప్రభావితం చేసే శక్తి వుండేది. ఇప్పుడు తెలుగు వారికి రెండు రాష్ట్రాలు వున్నప్పటికిని ఆ పరిస్థితి లేదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు! దక్షిణాది రాష్ట్రాలలో తమిళనాడు తమ రాష్ట్రంలో ప్రస్తుత లోక్‌సభ సీట్ల సంఖ్యే వుండాలని, ఆవిధంగానే డీలిమిటేషన్ జరగాలని సంకేతాలిస్తున్నది! ఈ విషయంలో ఆ రాష్ట్రం స్పష్టత కోరుతున్నది కానీ కేంద్ర ప్రభుత్వం తరఫున సంప్రదింపులు జరుపుతున్న మంత్రి కిరణ్ రిజిజు ఆ విషయంలో స్పష్టత ఇవ్వటం లేదు! ఏది ఏమైనా డీలిమిటేషన్ సమస్య కేంద్రం రాష్ట్రాల మధ్య సఖ్యతను కనపర్చటం లేదు. ఈ ప్రభుత్వం నాదీ అన్న భావన రాష్ట్రాలలోని ప్రజలకు వచ్చినప్పుడే ఫెడరల్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిధిలో ఆమోదయోగ్యంగా వుంటుంది. అది లేని నాడు ఇతర దేశాల మాదిరి అనవసరపు అంతర్గతసమస్యలకు తావిచ్చినట్లవుతుంది. అదృష్ట వశాత్తు మన ప్రజలూ ప్రభుత్వాలూ, ప్రతిపక్షాలూ అంత దూరం పోనివ్వరని సామాన్యులు అనుకుంటున్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేక! ఆ ప్రత్యేకతను అధికారం అన్నివేళలా నిలుపుకోటానికి రాజకీయ పార్టీలు గిమ్మిక్కులు డీలిమిటేషన్ రూపంలో చేస్తాయని ఎవరూ భావించటం లేదు! ప్రధాని మోడీనాయకత్వంలో ఎన్.డి.యేకూటమి మన దేశానికి అంతర్జాతీయ పరిధిలో, క్లిష్ట సమయంలో కూడా అన్ని దేశాలూ ఆశ్చర్యపడే రీతిలో స్థిరమైన ప్రజాస్వామ్యంగా నిరూపించుకున్నది! 'ఎమర్జెన్సీ' తప్పుని ఒడి పోవటానికి సిద్ధపడిన పార్టీ కాంగ్రెసు, ఎన్నో సంవత్సరాలు దేశాన్ని ఒడిదుడుకులకు లోనుకాకుండా నడపగలిగింది! అందుకనే భారత్‌లోని ప్రజలు శక్తియుక్తులతో ప్రభుత్వాలను ఎంపిక చేస్తున్నాయి! సమస్యలు ఎంత క్లిష్టంగా వున్నా అధిగమించే శక్తి దేశంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలకుఉందనీ, సరియైన సమయంలో దేశం విచ్ఛిన్నం కాకుండా సామరస్య ధోరణిలో అందరి సహకారంతో భారత దేశాన్ని ప్రగతి పథంలో నడిపే సత్తా ఉందని పరిపూర్ణంగా నమ్మటంలో ఎవరూ ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు!



విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.

డబ్ల్యు ఎమర్సన్



శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.

స్వామి వివేకానంద

ప్రజావాక్కు

నేతలను విస్మరిస్తున్నారు

కాంగ్రెసు నాయకుడైన సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని ఘనంగా స్మరించిన బిజెపి నాయకులకు దేశ ప్రధానిగా సేవలందించిన ఇందిరాగాంధీ వర్ధంతి గుర్తుకు రాలేదా?ఇందిరా గాంధీ అంటే ఒక్కఎమర్జెన్సీయేనా వారి మదిలో మెదిలేది? ఆమె చేసిన మంచి సంస్కరణలు స్ఫురణకు తెచ్చుకునే సంస్కారంలేదా కాంగ్రెసేతరులకు? రాస్తే చాంచాడవుతుంది.పాకిస్థాన్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్ ఆవిర్భావానికి ఆమె నిర్వహించిన మహత్కార్యాన్ని దేశ విదేశ ప్రముఖులందరూ వేనోళ్ళ కొనియాడారు. ఎమర్జెన్సీ అనే ఒక వికృతచర్య విధించిన కారణంగా ఆమెను పూర్తిగా బహిష్కరించడం ముఖ్యంగా బిజెపికి తగదనిపిస్తోంది.ఆమె తీసుకున్న కొన్నినిర్ణయాలు అమెరికా, రష్యా దేశాలను హడలెత్తించాయి. ఆమెను ఎన్నికల్లో ఓడించిన జనతా పార్టీ రెండేళ్ళు ప్రభుత్వాన్ని నడపలేకపోయాయి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

విద్యావ్యవస్థలో సవాళ్లు

ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, పాఠశాల సమాచార నివేదికనిబంధనల పేరుతో ఉపాధ్యాయులపై పెరుగుతున్నపరిపాలనాపరమైన నిబంధనలు విద్యావ్యవస్థలో సవాలుగా మారుతున్నాయి.పాఠ్యాంశాలబోధన, పాఠాల ప్రణాళికల రూపకల్పన, జవాబుపత్రాల మూల్యాంకనం, విద్యార్థుల ప్రగతి పర్యవేక్షణ వంటి ప్రాథమిక బాధ్యతలతో ఉపాధ్యాయులునిరంతరం బిజీగాఉంటారు. దీనికి తోడు అదనపు కాగితపు పని, డిజిటల్ డేటా నమోదు, నివేదికల సమర్పణ వంటి బాధ్యతలు వారిబోధనా సమయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ప్రతి సమాచారాన్ని నిర్ణీత గడువులోగా నమోదు చేయాలనే ఒత్తిడి వల్ల ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు కేటాయించాల్సిన సమయాన్ని కోల్పోతున్నారు.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

పరిశుభ్రత అందరి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడపడితే అక్కడ చెత్తవేయడం, ప్లాస్టిక్ సీసాలు,కవర్లు, ఆహారఅవశేషాలు రోడ్లపైపడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, అన్ని కూడా అంతే శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

-జి.అశోక్, కరీంనగర్

హర్షణీయం

రైళ్లలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేయాలన్న రైల్వే నిర్ణయం హర్షణీయం. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయంఎంతో సముచితమైనది. ముఖ్యంగా రాత్రి వేళ ప్రయాణికులు నిద్రలో ఉన్నప్పుడు ఛార్జింగ్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఏదైనా అసాధారణ పరిస్థితి ఏర్పడితే వెంటనే గుర్తించడం కష్టమవుతుంది. విద్యుత్ పరికరాలు, బ్యాటరీల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రయాణికుల సౌకర్యంతో పాటు వారి క్షేమానికి ప్రాధాన్యంఇవ్వడం అభినందనీయం.ప్రయాణానికి ముందుగానే తమఫోన్లు, ఇతర పరికరాలను ఛార్జింగ్ చేసుకోవడం మంచిది. రైల్వే సిబ్బంది సూచనలకు ప్రయాణికులు సహకరించాలి. మన భద్రత మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రయాణికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తీసుకునే ప్రతి ముందస్తు జాగ్రత్తకు సహకరించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మానవ వివేచన ముఖ్యం

కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరిస్తున్నకొద్దీ ఉద్యోగ ప్రపంచం స్వరూపం కూడా గణనీయంగా మారుతోంది. ఏఐ ఆధారిత కోర్సులకు బిజినెస్‌స్కూళ్లు,ఉన్నత విద్యాసంస్థలు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే.సాంకేతికపరిజ్ఞానంతో పాటు మానవీయ నైపుణ్యాలను పెంపొందించడంపైనే విద్యాసంస్థలు దృష్టిసారించాలి. కమ్యూనికేషన్,బృందంగా పనిచేయడం, విమర్శనాత్మకఆలోచన,సమస్యపరిష్కారం,నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు ఏఐవిస్తరిస్తున్నా తమ ప్రాధాన్యాన్ని కోల్పోవు. యంత్రం సమాచారాన్ని వేగంగా విశ్లేషించగలదు. కానీ ఆ సమాచారానికి సందర్భాన్ని జోడించడం,దాని విశ్వసనీయతను పరిశీలించడం, నైతిక పరిణామాలను అంచనా వేయడం, మానవ వివేచనపైనే ఆధారపడి ఉంటుంది.

- ఎం. వి. చరన్, నల్గొండ

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటిసరఫరా,విద్యుత్ కలిపేచేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఇవి లేనందున కొందరు అమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు.

- బి. మేఘునాదం, విశాఖపట్నం

నీటి కరవు బాధ్యత సామాన్యుడికేనా?

కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రతి చుక్కను పొదుపు చేయాలి. తెలంగాణ మళ్లీ నీటి పరీక్షను ఎదుర్కొంటోంది. వర్షాలు తగ్గాయి. జలాశయాల్లో నిల్వలు క్షీణిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రాబోయే వేసవిని తలుచుకుంటేనేప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమయంలో ప్రభుత్వం, అధికారులు ప్రజలకు ఒకే సందేశం ఇస్తున్నారు, నీటిని పొదుపు చేయండి అని. ఆ సందేశం సరైనదే. కానీ ఒక ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చింది. నీటిని పొదుపు చేయాల్సింది కేవలం సామాన్యుడేనా?.ఇటీవలి పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. జూన్ నుంచి అక్టోబర్ వరకు తెలంగాణలో సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గింది. ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో ఉపయోగించదగిన నీటి నిల్వలు సాధారణ స్థాయితో పోలిస్తే తీవ్రంగా తగ్గాయి. హైదరాబాద్‌కు కీలకమైన సింగూరు జలాశయంలో పూర్తిసామర్థ్యంతో పోలిస్తే నిల్వలు అత్యల్పస్థాయికి చేరాయి. అందుబాటులోని నీటిలో మొదటి ప్రాధాన్యం తాగునీటికే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో ఒక కుటుంబానికి సగం నీరు మాత్రమే ఇవ్వడం, షవర్‌కు బదులు బకెట్ స్నానం చేయడం, లీకేజీలను అరికట్టడం తప్పనిసరి. కానీ ప్రజలపై పొదుపుప్రచారం చేస్తూనే, మరోవైపు భారీగా నీటిని వినియోగించే పరిశ్రమలకు ఎలాంటి ప్రమాణాలు లేకుండా అవకాశాలు కల్పిస్తే అది సమగ్ర నీటి విధానం ఎలా అవుతుంది? బీరు, పానీయ పరిశ్రమలది. బీరు తయారీలో నీరు ప్రధాన ముడిసరుకు మాత్రమే కాదు, శుభ్రపరిచే ప్రక్రియలు, శీతలీకరణ వంటి అనేకదశల్లో కూడా నీరు అవసరం. నీటి ఎద్దడిప్రాంతాల్లో ఇటువంటి పరిశ్రమలు ఎంత నీటిని వినియోగిస్తున్నాయి? ఆ నీరు నదుల నుంచి వస్తోందా, భూగర్భజలాల నుంచి వస్తోందా? వాటి వినియోగ వివరాలు ప్రజలకు ఎందుకు అందుబాటులో ఉండకూడదు?



హైదరాబాద్‌ను డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దడం ఆర్థికంగా అవసరమే. పెట్టుబడులు, ఉపాధి, సాంకేతిక అభివృద్ధి, అన్నీ రాష్ట్రానికి అవసరమైనవే. అయితే, కొన్నిసంప్రదాయ శీతలీకరణ పద్ధతులు గణనీయమైన నీటిని వినియోగిస్తాయి. 5గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం వంటి భారీ లక్ష్యాలను నిర్దేశిస్తున్నప్పుడు, వాటి నీటిఅవసరాలపై ముందస్తు లెక్కలు, ప్రజా చర్చ జరగకూడదా? ఇక్కడ పరిశ్రమలకు వ్యతిరేకత కాదు సమస్య. నీటి వినియోగంలో బాధ్యత, పారదర్శకత కావాలన్నదే అసలు డిమాండ్. ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని చర్యలు స్వాగతించదగ్గవే. శుద్ధిచేసిన మురుగు నీటిని పరిశ్రమలు, డేటా సెంటర్లకు సరఫరాచేయడం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టడం సరైన దిశ. నీటి రహిత లేదా తక్కువ నీటి శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించడం కూడా అవసరం. కానీ ఇవి కేవలం ప్రణాళికలుగా కాకుండా అనుమతులకు ముందస్తు షరతులుగా మారాలి. తెలంగాణకు నీరు అపరిమిత వనరుకాదు. కృష్ణా,గోదావరి జలా లపై ఆధారపడే రాష్ట్రం కావడంతో దీర్ఘకాల నీటి భద్రతకు ప్రత్యేక ప్రణాళిక అవసరం. ప్రతి కొత్త భారీ పరిశ్రమకు ముందుగా వాటర్ బడ్జెట్,వాటర్ ఆడిట్,శుద్ధిచేసిన నీటి వినియోగం, వర్షపు నీటిసంరక్షణ వంటి ప్రమాణాలు తప్ప నిసరి చేయాలి. సామాన్యుడికి మాత్రం ఒక్క చుక్క కూడా వృథా చేయొద్దు అనిచెప్పి, పెద్ద వినియోగదారులకు మినహాయింపులు ఇవ్వడం న్యాయం కాదు. ఒక వైపు రైతుకు సాగునీటిలో కోత,మరోవైపు నగరాల్లోనీటి సరఫరాపై ఆంక్షలు, ఇదేసమయంలో పరిశ్రమల నీటి వినియోగంపై పూర్తి లెక్కలు ప్రజలకు తెలియకపోతే ప్రశ్నలు రావడం సహజం. నీటి కరవు ప్రకృతి విపత్తు కావచ్చు. కానీ నీటి కొరతను మరింత తీవ్రం చేసే విధానపరమైన తప్పిదాలకు మనమే బాధ్యులం.అందుకే ఈ సంక్షోభంలో ఒకే సూత్రం ఉండాలి. పొదుపు సామాన్యుడి బాధ్యత మాత్రమే కాదు, జవాబుదారీతనం ప్రభుత్వానిది, సంయమనం పరిశ్రమలది. నీటి ప్రతి చుక్కకు విలువ ఉన్న తెలంగాణలో, ఇంట్లోని కుళాయిని మాత్రమే కాదు, పరిశ్రమల నీటి పైపులనూ ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది.

ఫెయిర్‌ఫాక్స్ ఒప్పందం ప్రజా ప్రయోజనాలకు విఘాతం!



జి. కిషోర్ కుమార్

ఐడిబిఐ బ్యాంకు నియంత్రణాధికారాన్ని కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్సియల్ హెరాల్డింగ్స్‌కు బదిలీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి, బ్యాంకుల యాజమాన్యఉనికికి, భారత బ్యాంకింగ్ వ్యవస్థ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన ప్రశ్నలకు కేంద్రబిందువు అయింది. దేశ పారిశ్రామికఅభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలనేఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన ఐడిబిఐ దేశ ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంపొందించటంలో విశేషపాత్ర పోషించింది. ప్రజాధనం, ఉద్యోగుల శ్రమ, ఖాతాదారుల నమ్మకమనే పునాది ప్రాతిపదికన నిర్మితమైన ఈ బ్యాంకింగ్ సౌధాన్ని విక్రయించదగిన వాణిజ్య ఆస్తిగా పరిగణించడం సమంజసం కాదు. 'ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'(ఐడిబిఐ) 1964 జూలై 1న, పారిశ్రామిక అభివృద్ధి బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం ప్రకారం ఏర్పడి దేశ పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి. పరిశ్రమల ఆధునీకరణ, ఉత్పాదక సంస్థల విస్తరణ, వెనుకబడిన ప్రాంతాలలో పారిశ్రామిక కార్యకలాపాలకు తోడ్పాటు అందిస్తూ దశాబ్దాలుగా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచి, 2004లో బ్యాంకింగ్ సంస్థగా రూపాంతరం చెందింది. బ్రాంచి నెట్వర్క్, లాభదాయకత, డివిడెండ్ పేమెంట్, నైపుణ్యంగల ఉద్యోగులు, రుణాలు పొందిన లబ్దిదారులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధి, పారిశ్రామిక యూనిట్ల విస్తరణ, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల నిధులు, ఖాతాదారులకు విలువైన సేవలు వంటి అనేక అంశాలతో దశాబ్దాలుగా ఐడిబిఐ ప్రస్థానం నిరుపమానం. కేవలం లాభాల ప్రాతిపదికన పనిచేసే సంస్థగా కాకుండా, ఉపాధి కల్పన, దేశీయ పొదుపు సమీకరణలో ముఖ్యపాత్ర, సమ్మిళితాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి వంటి ఉన్నత లక్ష్యాలతో ముడిపడిన ఆర్థిక చోదక శక్తిగా ఐడిబిఐని అభివర్ణించవచ్చు. సామాజిక భద్రతా కార్యక్రమాలకు తోడ్పడటం, కుటుంబాలకు,సూక్ష్మ వ్యాపార సంస్థలకు, చిన్న రుణ గ్రహీతలకు రుణాలను అందించటం, మూలధన మార్కెట్ల పురోగతిలో, బ్యాంకింగ్ సేవల విస్తరణలో పారిశ్రామిక ప్రాజెక్ట పురోభివృద్ధిలో, వ్యాపార సంస్థల విస్తరణలో, ప్రజల పొదుపు సమీకరణలో బ్యాంకింగ్ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోనికి తేవటంలో సుదీర్ఘకాలంగా విస్తృత బాధ్యతలను నిర్వహించిన ఐడిబిఐ బ్యాంకును విదేశీ యాజమాన్యానికి అప్పగించటం వలన దేశ ప్రజలకు కలిగే అదనపు ప్రయోజనం ఏమిటనేది మౌలిక ప్రశ్న. దశాబ్దాల పయనంలో ఐడిబిడిలో ఏర్పడిన ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులు, మూలధన అవసరాల నేపథ్యంలో, 2019లో ఎపిసి ఆఫ్ ఇండియా ఐడిబిఐ బ్యాంకులో నియంత్రణ వాటాను కొనుగోలు చేసింది. అనంతరం రిజర్వు బ్యాంకు వర్గీకరణ, నియంత్రణా నిబంధనల ప్రకారం ఐడిబిఐ బ్యాంకును ప్రైవేటురంగ బ్యాంకుగా పరిగణించింది. ఫెయిర్‌ఫాక్స్ యాజమాన్య బదిలీ ప్రతిపాదన ముందు భారత ప్రభుత్వం 45.48, ఎల్ఐసి 49.24 వాటాలను కలిగి ఉంది. అంటే ఈ రెండిటి వాటా94.72. ప్రభుత్వరంగ బీమాసంస్థ ఎల్ఐసి ఐడిబిఐలో ప్రధాన వాటాదారుగా మారి బ్యాంకు స్థిరీకరణ తోడ్పడటం కీలకాంశం. ఐడిబిఐ బ్యాంకు వాటాల ఉపసంహారణ ప్రక్రియ 2002లో ప్రారంభమైనప్పటికీ, ప్రక్రియలో జాప్యం, లావాదేవీలు ముందుకు సాగకపోవడం, వాటా విలువ నిర్ధారణపై భిన్నాభిప్రాయాలు, ఆశించిన బిడ్లు రాకపోవడం వంటి అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనంతరం ప్రభుత్వం ఒక్కో షేరుకు రూ.94.42 గా నిర్ణయించినప్పటికీ, ప్రారంభ రిజర్వు ధరకు తగిన బిడ్లు రాకపోవడంతో తిరిగి సవరించిన ప్రతిపాదనలతో బిడ్లను ఆహ్వానించింది. అనంతరం ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పేరు రూ. 81 చొప్పున, మొత్తం 60.72 శాతం మేర వాటాకు, సుమారు 52,878 కోట్ల విలువైన ఫెయిర్ఫాక్స్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.స్వతంత్ర విలువ నిర్ధారణ ప్రమాణం ప్రకారం ఒక్కో పేరు విలువ రూ.75.99 అని, ఈ ప్రమాణం కంటే ఎక్కువ ధర లభించిన కారణంతోనే ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్సియల్ హెల్డింగ్స్‌కు ఐడిబిఐ నియంత్రణాధికారాన్ని బదిలీ చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొనటం సర్వత్రా చర్చనీయాంశమయింది. విలువ నిర్ధారణలో ఉపయోగించిన అంచనాలు,ఆస్తుల విలువ మూల్యాంకన పద్ధతులు, భవిష్యత్ ఆదాయ అంచనా,పనితీరు సామర్థ్యం, విదేశీ సంస్థకు బదలీ చేయకుండా ప్రభుత్వ యాజమాన్యాన్ని కొనసాగించే ప్రత్యామ్నాయాలపై పారదర్శకంగా చర్చ జరగకపోవడం తీవ్ర విమర్శకు గురియైనది.ఐడిబిఐ బ్యాంకును విక్రయించక తప్పదనే వాదన గతంలో అది ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభాన్ని ఆధారంగా చేసుకుని కొనసాగిస్తున్న పోకడ మాత్రమే. 2017లో రిజర్వు బ్యాంకు అధిక నిరర్థక ఆస్తులు, నష్టాల కారణంగా ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ పరిధిలోకి తీసుకువచ్చినప్పటికీ, అనంతరం మెరుగుపడిన ఆర్థిక పరిస్థితులదృష్ట్యా 2021లో ఆపరిమితులను తొలగించింది.2018లో 31.78 గా ఉన్న స్థూలనిరర్థక ఆస్తుల నిష్పత్తి,2026 మార్చినాటికి 2.32 శాతానికి, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.15 శాతానికి తగ్గింది. మూలధన సంవృద్ధి నిష్పత్తి 26.65 శాతానికి చేరి, గణనీయమైన పనితీరును ప్రదర్శించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఐడిబిఐ సుమారు రూ. 9,513 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహారణ, ప్రైవేటీకరణ స్థాయిని దాటిపోయి ప్రభుత్వ విధానాలు పరాయీకరణ దిశగా పయనించే పరిస్థితికి చేరాయనేదానికి ఈ ప్రక్రియ ఒక ఉదాహరణ. సుమారు 2000 శాఖలతో విస్తరించిన ఐడిబిఐలో ప్రభుత్వ మెజారిటీ వాటాను కొనసాగించడం, పారదర్శకంగా విలువ నిర్ధారణ చేయడం, ఉద్యోగుల, డిపాజిటర్ల హక్కులకు చట్టబద్ధత కలిగించడం, ఉత్పాదక రంగాలకు రుణాల మంజూరును పరిరక్షించడం, పార్లమెంటరీ కమిటీని నియమించడంవంటి చర్యలు తక్షణ అవసరం అనేది ప్రజాభిప్రాయం.



గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

వీసాల పొడిగింపు రద్దు యోచనలో ట్రంప్ సర్కార్

వాషింగ్టన్, నవంబరు 2: అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే కీలక ప్రతిపాదనను ట్రంప్ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. హెచ్1బీ, ఎల్1 వంటి నాన్ఇమ్మిగ్రెంట్ వీసాల పొడిగింపు ప్రక్రియను కఠినతరం చేసేలా కొత్త నిబంధనలను రూపొందించింది. దీనివల్ల ముఖ్యంగా భారతీయ టెకీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అమెరికాలో డిఫరెన్స్ టు ప్రయర్ డిటర్మినేషన్స్ అనే విధానం అమల్లో ఉంది. దీని ప్రకారం ఒక ఉద్యోగికి గతంలో వీసా మంజూరై, అవే పరిస్థితుల్లో పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకుంటే, ఇమ్మిగ్రేషన్ అధికారులు సాధారణంగా ఆమోదం తెలుపుతారు. అయితే, ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ప్రతిపాదించింది. ఈ కొత్త రూల్ అమల్లోకి వస్తే, ప్రతి వీసా పొడిగింపు దరఖాస్తును ఒక కొత్త పిటిషన్‌గా పరిగణించి, మొదటి నుంచి పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గణాంకాల ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరంలో వీసా పొడిగింపు పొందిన హెచ్1బీ లబ్ధిదారులలో 79 శాతం మంది భారతీయులే ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త నిబంధనల ప్రభావం అత్యధికంగా వారిపైనే పడనుంది. ఈ మార్పు వల్ల ఏటా దాదాపు 2,08,000 పిటిషన్లపై ప్రభావం పడుతుందని, అదనంగా 6,000 దరఖాస్తులకు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ) జారీ కావొచ్చని డీహెచ్ఎస్ అంచనా వేసింది. దీనివల్ల వీసా ప్రాసెసింగ్ సమయం సగటున 64 రోజులు ఆలస్యం అవుతుంది. హెచ్1బీ వీసాల విషయంలో మోసాలు, నిబంధనల ఉల్లంఘనలు పెరిగాయని, వాటిని అరికట్టేందుకే ఈ మార్పులు తెస్తున్నామని డీహెచ్ఎస్ వాదిస్తోంది. పాత విధానం వల్ల దరఖాస్తుదారుడికి బదులుగా, తిరస్కరించడానికి గల కారణాలను నిరూపించుకోవాల్సిన భారం ఇమ్మిగ్రేషన్ అధికారిపై పడుతోందని పేర్కొంది. ఈ మార్పు వల్ల ఉద్యోగులు, కంపెనీలు తమ భవిష్యత్ ప్రణాళికల విషయంలో అనిశ్చితికి గురవుతారని కూడా అంగీకరించింది. ఈ ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణకు నవంబర్ 13 వరకు గడువు విధించారు. ప్రజలు తమ అభిప్రాయాలను వెబ్‌సైట్ ద్వారా తెలియజేయవచ్చు. తుది నిబంధన అమల్లోకి వచ్చేవరకు ప్రస్తుత విధానమే కొనసాగుతుంది. ఈ డిఫరెన్స్ పాలసీని గతంలో 2017లో ట్రంప్ ప్రభుత్వం రద్దు చేయగా, 2021లో బైడెన్ ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టింది. ఇప్పుడు మళ్లీ దానిని రద్దు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.




బంగ్లాలో మళ్లీ చెలరేగిన హింస

పోలీసులపై దాడులు, వాహనాలకు నిప్పు

కనీస వేతనాలు పెంచాలని కార్మికుల డిమాండ్

ఢాకా, నవంబరు 2: బంగ్లాదేశ్ మరోసారి అట్టుడుకుతోంది. నిరసనలు తీవ్ర హింసకు దారి తీశాయి. కార్మికులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. పోలీసులపై దాడులు, రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పుపెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారు. పలు ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించారు. వేతనాల పెంపును డిమాండ్ చేస్తూ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు ఈ నిరసనలకు దిగారు. కనీస వేతనాన్ని పెంచాలని కోరతున్నారు. 2024 జూలైలో అప్పటి ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ వ్యాప్తంగా తీవ్ర హింసాత్మక ఆందోళనలు జరిగాయి. దాదాపు 28 నెలల తర్వాత మరోసారి బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గతనెల 31న ఈ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఢాకాలోని మిర్పూర్, ఆశులియా, సావర్, గాజీపూర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు రహదారులను దిగ్బంధించి గార్మెంట్ ఫ్యాక్టరీలను మూసివేయించారు. నిరసనలు, సమ్మెల కారణంగా సుమారు 529 ఫ్యాక్టరీలు ప్రభావితమయ్యాయి. దాదాపు 10 లక్షల మంది కార్మికులపై దీని ప్రభావం ఉంది. నిరసనల్లో పాల్గొన్న కార్మికులు పోలీసులతో ఘర్షణకు దిగారు. పోలీస్ వాహనాలకు నిప్పు పెట్టడంతో పాటు విధ్వంసం సృష్టించారు. నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ కేనన్లు, సౌండ్ గ్రెనేడ్లు వాడారు. పరిస్థితిని అదుపు చేసేందుకు కొన్ని ప్రాంతాల్లో బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ బలగాలను కూడా మోహరించారు. సోమవారం ఫ్యాక్టరీలు తిరిగి ప్రారంభమవుతాయని భావించినప్పటికీ, పరిస్థితి అదుపులోకి రాలేదు, కార్మికులు మళ్లీ రోడ్లపైకి రావడంతో ఢాకాలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్‌లో గార్మెంట్ కార్మికులు నెలకు కనీస వేతనంగా 30,000 టాకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వారికి సుమారు 12,000 టాకాల వేతనం అందుతోందని తెలుస్తోంది. ఆహారం, ఇంటి అద్దె, రవాణా, వైద్య ఖర్చులు పెరగడంతో తమ కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గిందని కార్మికులు చెబుతున్నారు. ఈ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే, ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు, అశాంతి వెనక షేక్ హసీనా ప్రభుత్వంతో సంబంధం ఉన్న పారిశ్రామికవేత్తల హస్తం ఉందని బంగ్లాదేశ్ ఆరోపిస్తోంది. నవంబర్ 2న హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ, అవామీలీగ్‌తో సంబంధాలున్న కొందరు ఫ్యాక్టరీ యజమానులు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, సహాయ మంత్రులు గార్మెంట్ పరిశ్రమలో అస్థిరతను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచంలోని ప్రముఖ వస్త్ర ఎగుమతిదారుల్లో బంగ్లాదేశ్ రెండో స్థానంలో ఉందని, చైనా తర్వాతి స్థానంలో ఉంది. ఈ దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంతో ఈ రంగం కీలకంగా ఉంది. యూరప్, అమెరికాలతో సహా అంతర్జాతీయ మార్కెట్లలో బంగ్లాదేశీ తయారీ దుస్తులకు మంచి గిరాకీ ఉంది. టీషర్టులు, షర్టులు, ట్రౌజర్లు, జీన్స్, జాకెట్లు వంటి రెడీమేడ్ దుస్తులను ఇక్కడి ఫ్యాక్టరీల్లో తయారు చేస్తారు. ఈ పరిశ్రమలో లక్షలాది మంది పనిచేస్తున్నారు.



శరద్ పవార్‌కు తీవ్ర అస్వస్థత

- పుణే ఆస్పత్రిలో చేరిక.. ప్రత్యేక బృందం వైద్యచికిత్సలు

- పవార్ ఆరోగ్యం నిలకడగా ఉంది: సుప్రియా సూలే

పుణె, నవంబర్ 2: ఎన్‌సిపి అధినేత, సీనియర్ రాజకీయ నాయకుడు శరద్ పవార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్లూరిటిక్ నొప్పి, దగ్గుతో బాధపడటంతో సోమవారం పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన్ను ఐసియులో ఉంచి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో ఉంచారు. ప్లూరిటిక్ నొప్పి ఫిర్యాదుల నేపథ్యంలో సాధారణ ఆరోగ్య పరీక్ష, వైద్య పర్యవేక్షణ కోసం పవార్‌ను చేర్చినట్లు ఆస్పత్రి మెడికల్ బులెటిన్ విడుదల చేసింది. "ఆయన పరిస్థితి మెరుగు పడుతుందని భావిస్తున్నాము, ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నార్ను ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ కె. గ్రాంట్ తెలిపారు. పవార్ కుమార్తె, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వర్కింగ్ ప్రెసిడెంట్, బారామతి పార్లమెంట్ సభ్యురాలు అయిన సుప్రియా సూలే, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్‌'లో ఒక పోస్ట్ ద్వారా ఆయన ఆసుపత్రిలో చేరిన విషయాన్ని ధ్రువీకరించారు. 'దగ్గు ఎక్కువ కావడంతో బాబాను పుణెలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. వైద్య పరీక్షలు జరుగుతున్నాయి.

కార్చిచ్చు విషవాయువులు పీల్చి70 లక్షలమంది మృతి!



కాలిఫోర్నియా, నవంబరు 2: అమెరికాలోని కాలిఫోర్నియాలో గత ఏడాది సంభవించిన కార్చిచ్చు ఏకంగా 70 లక్షల మందిని పొట్టనపెట్టుకుంది. కార్చిచ్చుతో గాలిలో కలిసిన విషయవాయువులు పీల్చడంవల్లనే ఈ దారుణం సంభవించింది. ఆనాటి భయానక సంఘటనలు ఇప్పటికీ కళ్లముందు అమెరికా ప్రజలకు కదులుతూనే ఉన్నాయి. 2025 జనవరిలో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌ను కుదిపేసిన కార్చిచ్చు సృష్టించిన భయానక పరిణామాలివి. ఈ మంటలు అడవులకే పరిమితం కాలేదు. జనావాసాల్లోకి చొచ్చుకెళ్లి ఇళ్లు, వాహనాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను దహించేశాయి. వాటి నుంచి వెలువడిన విషపూరిత పదార్థాలు పొగతో కలిసి వాతావరణంలోకి చేరాయి. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ భయంకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సాధారణ స్థాయితో పోలిస్తే ఈ కార్చిచ్చు పొగలో సీసం స్థాయిలు ఏకంగా 80 రెట్లకు పైగా పెరిగాయి. ఆర్సెనిక్ మూడు రెట్లు అధికంగా ఉంది. క్లోరిన్, బ్రోమిన్ స్థాయిలు ఏడు రెట్లు పెరిగాయి. ముఖ్యంగా ఈటన్ ఫైర్ నుంచి వెలువడిన పొగలో విషపూరిత లోహాల సాంద్రత ప్రమాదకరంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇక్కడ అసలు భయం మంటల్లో లేదు. ఆ మంటలు వదిలిన గాలిలో ఉంది. సీసం అనే విషపూరిత లోహం మనిషి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చిన్నపిల్లల్లో మెదడు ఎదుగుదలను దెబ్బతీసి, ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని తగ్గించవచ్చు. పెద్దల్లో అధిక రక్తపోటు సహా అనేక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఇక ఆర్సెనిక్‌కు కొన్ని రకాల క్యాన్సర్లతో సంబంధం ఉంది. అయితే ఇంత తక్కువ సమయంలో అత్యధిక స్థాయిలో ఈ పదార్థాలకు గురికావడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడిందనే విషయం ఇంకా పూర్తిగా తేలలేదు. ఈ అధ్యయనం లక్షలాది మంది విషపూరిత కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉందని చెబుతోంది. వారిలో ఎంతమందికి అనారోగ్య సమస్యలు వచ్చాయో మాత్రం నిర్ధారించలేదు. ఈ పరిశోధన మరో ప్రమాదకరమైన వాస్తవాన్ని గుర్తుచేస్తోంది. కార్చిచ్చు అంటే కేవలం చెట్లు, గడ్డి కాలిపోవడం మాత్రమే కాదు. మంటలు జనావాసాల్లోకి చేరినప్పుడు అవి వదిలే పొగ మరింత ప్రమాదకరమైన రసాయనాల మిశ్రమంగా మారుతుంది. ఇక మంటలు ఒక ప్రాంతాన్ని దహించవచ్చు. కానీ ఆ పొగ ప్రయాణం మాత్రం అక్కడితో ఆగిపోదు. మంటలకు మైళ్ల దూరంలో ఉన్న మనుషుల ఊపిరితిత్తుల్లోకి కూడా చేరవచ్చు. అగ్నిప్రమాదం నుంచి తప్పించుకోవడానికి మనుషులు ఇళ్లను ఖాళీ చేస్తారు. మరి కంటికి కనిపించకుండా వెంటాడే విషపూరిత పొగ నుంచి ఎలా తప్పించుకోవాలి? అదే ఇప్పుడు శాస్త్రవేత్తల ముందున్న అతిపెద్ద ప్రశ్న.

ఐదు సెనేట్ రాష్ట్రాల్లో రిపబ్లికన్ల కంటే

డెమొక్రాట్లదే హవా!



వాషింగ్టన్, నవంబరు 2: అమెరికాలో మరో 24 గంటల్లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుగాలి వీస్తోంది. ముఖ్యంగా ఆయన ఆర్థిక విధానాలు, ఇరాన్ యుద్ధం వంటి అంశాల్లో అమెరికన్లు తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీని ప్రభావం మధ్యంతర ఎన్నికల్లో కనిపించేలా ఉంది. తాజాగా న్యూయార్క్ టైమ్స్ సీయానా కలిసి నిర్వహించిన ప్రీపోల్‌లో ఐదు కీలక సెనేట్ రాష్ట్రాల్లో ట్రంప్ సొంత పార్టీ రిపబ్లికన్ల కంటే డెమొక్రాట్లు ముందంజలో ఉన్నట్లు తేలింది. అమెరికా కాంగ్రెస్ లోని రెండు సభలైన ప్రతినిధుల సభ, సెనేట్ కు రేపు ఎన్నికలు జరగబోతున్నాయి. వీటిలో ప్రతీ రెండేళ్లకు సెనేట్ కు జరిగే ఎన్నికలతో పాటు ప్రతినిధుల సభకు జరిగే ఎన్నికలు కూడా ఉన్నాయి. ఈ లెక్కన ప్రతినిధుల సభలోని 435 సీట్లకు, సెనేట్ లోని 35 సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో ప్రస్తుతం రిపబ్లికన్ల చేతుల్లో ఉన్న ఆరు కీలక రాష్ట్రాల్లో ఐదింటిలో డెమొక్రాట్లు బాగా పుంజుకున్నట్లు న్యూయార్క్ టైమ్స్ అంచనా వేస్తోంది. అయోవాలో పోటీ దాదాపు సమంగా ఉందని, డెమొక్రాట్లు తమ సెనేట్ సీటును కాపాడుకుంటున్న ఏకైక రాష్ట్రమైన మిచిగాన్‌లో రెండంకెల ఆధిక్యాన్ని కనబరిచారని పోల్ తెలిపింది. ఎన్నికల రోజుకు ముందు టైమ్స్ సియానా నిర్వహించిన చివరి విడత సర్వేల ఆధారంగా వెలువడిన ఈ ఫలితాలు.. డెమొక్రాట్లకు ఒక చారిత్రాత్మక అవకాశం లభించబోతోందని సూచిస్తున్నాయి. సెనేట్‌లో మెజారిటీ సాధించాలంటే, ఆ పార్టీ తన ప్రస్తుత సీట్లను నిలబెట్టుకోవడంతో పాటు, రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న కనీసం నాలుగు సీట్లను కైవసం చేసుకోవాలి. తాజా పోల్ లో టెక్సాస్, కాన్సాస్‌లలో సీన్ రివర్స్ అయినట్లు కనిపిస్తోంది. ఈ రాష్ట్రాలకు దీర్ఘకాలంగా రిపబ్లికన్ల ఓటింగ్ చరిత్ర ఉన్నప్పటికీ, అక్కడ డెమొక్రాట్లు ఆధిక్యం సాధించగలిగారు. వీటిలో టెక్సాస్ డెమొక్రాట్ జేమ్స్ తలారికో, రిపబ్లికన్ కెన్ పాక్సన్‌పై 50 నుండి 43 ఆధిక్యంతో ముందున్నారు. కాన్సాస్ డెమొక్రాట్ ఆడమ్ హామిల్టన్, ప్రస్తుత రిపబ్లికన్ రోజర్ మార్షల్‌పై 49 నుండి 44 ఆధిక్యంతో విజయం సాధించారు. మెయిన్‌లో కూడా డెమొక్రాట్లు ఆధిక్యంలో ఉన్నారు, ఇక్కడ ట్రాయ్ జాక్సన్, రిపబ్లికన్ సెనేటర్ సుసాన్ కాలిన్స్‌పై 51 నుండి 45 ఆధిక్యంతో ముందున్నారు. ఒహాయోలో మాజీ సెనేటర్ షెరాడ్ బ్రౌన్, ప్రస్తుత సెనేటర్ జాన్ హుస్టెడ్‌పై 49 నుండి 44 ఆధిక్యంతో ముందున్నారు. అలాస్కాలో రిపబ్లికన్ సెనేటర్ డాన్ సుల్లివన్‌పై మేరీ పెల్టోలా 48 నుండి 46 ఆధిక్యాన్ని కలిగిఉన్నారు. అయోవాలో డెమొక్రాట్ జోష్ టురెక్ రిపబ్లికన్ యాష్లీ హిన్సన్ కంటే 48 నుండి 47 ఓట్లతో స్వల్పంగా ముందంజలో ఉన్నారు. మిచిగాన్‌కు చెందిన అబ్దుల్ ఎల్‌సయాద్ అత్యధిక ఆధిక్యాన్ని కనబరిచారు. రిపబ్లికన్ మైక్ రోజర్స్ 42 తో పోలిస్తే ఆయన 53 తో ముందంజలో ఉన్నారని పోల్ తెలిపింది.

ఉపాధికోసం వెళ్లి యుద్ధంలో చిక్కుకున్న భారత్ యువకులు

ఇదే మాచివరి రోజు అని అధికారులను వేడుకొంటూ వీడియో రిలీజ్



మాస్కో, నవంబరు 2: ఉపాధి కోసం రష్యా వెళ్లిన విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులతో సహా ఐదుగురు తెలుగు యువకులు అక్కడి యుద్ధ క్షేత్రంలో తీవ్ర ప్రాణభయంతో అల్లాడుతున్నారు. రష్యా సైన్యంలో ఫుడ్ ప్యాకింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నేపాల్‌కు చెందిన ఒక ఏజెంట్ వీరిని నమ్మించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తీరా అక్కడికి వెళ్లాక, నకిలీ కాంట్రాక్టులతో వారిని మోసం చేసి రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులోని భయంకరమైన యుద్ధ రంగానికి బలవంతంగా పంపించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దుల్లో సైన్యం పహారా నడుమ చిక్కుకుపోయిన ఈ యువకులు తాజాగా ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. "ఇక్కడ ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బహుశా ఇదే మాకు చివరి రోజు కావచ్చు. కనీసం మేము బతికి బయటపడతామో లేదో కూడా చెప్పలేం" అని కన్నీళ్లు పెట్టుకుంటూ వారు తమ దీనస్థితిని వివరించారు. బాంబుల మోతలు, తుపాకుల శబ్దాల మధ్య ప్రతి క్షణం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మోసపోయామని గ్రహించేలోపే సరిహద్దుల్లోకి నెట్టేశారని, భారత ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ ప్రాణాలను కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు,

కేంద్ర ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు చేపట్టి, తమను సురక్షితంగా స్వదేశానికి, కన్నవారి వద్దకు చేర్చేలా సహాయం చేయాలని కన్నీళ్లతో వేడుకుంటున్నారు.

విశాఖకు చెందిన ఈ యువకుల కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆందోళన చెందుతూ, తమ పిల్లలను క్షేమంగా రప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

100 ఎకరాల్లో ఆశ్రయ్ కేర్ టౌన్‌షిప్


నీతా అంబాని భూమిపూజలు



ముంబయి, నవంబరు 2: రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ తన జన్మదినం సందర్భంగా ఒక భారీ మానవతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహారాష్ట్రలోని కర్జత్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన నీతా ముఖేష్ అంబానీ అనంత్ ఆశ్రయ్ కేర్ టౌన్‌షిప్‌కు ఆమె భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అనాథ పిల్లలు, వృద్ధులు, ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగులతో సహా 5వేల మందికి పైగా నిరాశ్రయులకు ఇది జీవితకాల ఆశ్రయం కల్పించనుంది. ముంబైకి సమీపంలోని కర్జత్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖేష్ అంబానీ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 5వేల మంది నివాసితులతో పాటు వారికి సేవలందించే సంరక్షకులు, వైద్య సిబ్బంది, వారి కుటుంబాలతో కలిపి మొత్తం 15వేల మందికి ఈ టౌన్‌షిప్ ఒక జీవనాధారంగా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని ప్రాజెక్ట్ కావడం విశేషం. ఈ సందర్భంగా నీతా అంబానీ మాట్లాడుతూ అత్యున్నత స్థాయి వైద్య సంరక్షణతో పాటు కుటుంబ తరహా వాతావరణం, విద్య, ఉపాధి అవకాశాలు, సామూహిక కార్యక్రమాలను ఒకేచోట అందించే సహాయక కేంద్రాన్ని సృష్టించడం తన వ్యక్తిగత నిబద్ధత అని తెలిపారు. నివాసితులకు కేవలం నీడ ఇవ్వడమే కాకుండా, వారి జీవితాల్లో వెలుగులు నింపేలా ఈ టౌన్‌షిప్‌ను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ టౌన్‌షిప్ నిర్మాణంలో ప్రత్యేకమైన ప్రణాళికను అనుసరిస్తున్నారు. పవిత్ర భారతీయ నదుల పేర్లతో 8 రెసిడెన్షియల్ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఇంట్లో హౌస్ పేరెంట్స్‌ను నియమించి, పిల్లలకు కుటుంబ వాతావరణాన్ని అందించనున్నారు. అంతేకాకుండా ఇక్కడ ఒక ప్రత్యేక ఆసుపత్రి, పునరావాస సేవలు, దేవాలయం, విశాలమైన ఉద్యానవనాలు, వ్యవసాయ క్షేత్రాలు, యువతకు ఉపాధి కల్పించేందుకు వృత్తి విద్యా శిక్షణా కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

ఒక్కరోజులోనే రూ.68.4 లక్షల జరిమానాలు వసూలు

ఢిల్లీ వాయుకాలుష్యంపై అధికారుల అలర్ట్



న్యూఢిల్లీ, నవంబరు 2: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు వింటర్ యాక్షన్ ప్లాన్‌ను కఠినంగా అమలు చేస్తు న్నారు. ఇందులో భాగంగా తొలిరోజైన ఆదివారమే వాహన తనిఖీలు, నిర్మాణ ప్రదేశాల్లో నిబంధనల ఉల్లంఘనలపై కొరడా ఝుళిపించారు. ఒక్క రోజులోనే మొత్తం రూ.68.4 లక్షల జరిమానాలు విధించారు. అధికారిక లెక్కల ప్రకారం, ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు కలిసి దాదాపు 15,000 వాహనాలను తనిఖీ చేశారు. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ (పీయూసీసీ) లేని 566 వాహనాలకు రూ.56.6 లక్షల జరిమానా విధించారు. సరిహద్దుల వద్ద నిబంధనలు ఉల్లంఘించి, ఢిల్లీలో ప్రవేశించడానికి ప్రయత్నించిన 1,539 వాహనాలను వెనక్కి పంపారు. వీరి నుంచి రూ.2 లక్షల ఫైన్ వసూలు చేశారు. బీఎస్6 ప్రమాణాలు లేని ఇతర ప్రాంత వాహనాలను ఢిల్లీలోకి రాకుండా నిలిపివేశారు. మరోవైపు, నిర్మాణ పనుల వల్ల ఏర్పడే దుమ్ము కాలుష్యంపై కూడా అధికారులు దృష్టి సారించారు. మొత్తం 300 నిర్మాణ ప్రాంతాలను తనిఖీ చేయగా, 32 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. వీరికి పర్యావరణ నష్టపరిహారం కింద రూ.9.8 లక్షలు విధించారు. కొన్ని నిర్మాణాలకు మూసివేత ఆదేశాలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ చర్యలపై ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా సోషల్‌మీడియాలో స్పందిస్తూ కాలుష్య నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ వింటర్ యాక్షన్ ప్లాన్ ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటుందని, ఈ కాలంలో పార్కింగ్ ఫీజుల పెంపు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 50 హాజరు వంటి నిబంధనలు కూడా ఉంటాయని అధికారులు తెలిపారు. అయితే, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు, అత్యవసర సేవలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

బిజెపిలో చేరిన ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలు



న్యూఢిల్లీ, నవంబరు 2: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీజేపీలో చేరారు. సోమవారం ఉదయం ఆప్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం కొన్ని గంటల్లోనే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు ఆదివారం పార్టీకి రాజీనామా చేసిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా సోమవారం బీజేపీలో చేరారు.

బాలీవుడ్ నటుడు ఇమ్రాన్‌ఖాన్‌కు బాంబే హైకోర్టు చురకలు



ముంబయి, నవంబరు 2: బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై బాంబే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లో పాల్గొన్న కారణంగా, దేశం విడిచి పెట్టి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు.. ఇమ్రాన్ ఖాన్ అమెరికా పౌరుడని, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు కలిగి ఉన్నారని కోర్టు గుర్తుచేసింది. భారత పౌరుడిలా వ్యవహరించలేరని స్పష్టం చేసింది.

ఇస్లామిక్ సూత్రాల ప్రకారం ఒమర్ అబ్దుల్లా వివాహం చెల్లదు!

శ్రీనగర్, నవంబరు 2: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జర్నలిస్ట్ నిధి రజ్దాన్ వివాహంపై మతపరమైన వివాదం తెరపైకి వచ్చింది. వీరిద్దరి వివాహం ఇస్లామిక్ సూత్రాల ప్రకారం చెల్లదని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మోలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ వ్యాఖ్యానించారు. షరియా ప్రకారం వివాహం చెల్లుబాటు కావాలంటే వధూవరులు ఇద్దరు ముస్లింలై ఉండాలని అన్నారు. ఒమర్ అబ్దుల్లా ముస్లిం అని, నిధి రజ్దాన్ ముస్లిం కాదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ నిరసనవల్ల 11 వేల కోట్ల నష్టం : ఢిల్లీ వ్యాపారులు

న్యూఢిల్లీ, నవంబరు 2: రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిన్న ఇండియా కూటమి నిర్వహించిన ర్యాలీ కారణంగా తమకు రూ.11వేల కోట్ల మేర భారీ వ్యాపార నష్టం వాటిల్లిందని ఢిల్లీ వ్యాపార సంఘాలు ఆరోపించాయి. పండుగల సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహించడం వల్ల వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నదని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది.

సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ నిన్న జరిగిన ర్యాలీ వల్ల ఢిల్లీకి ప్రత్యక్షంగా రూ.11వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

ప్రపంచంలో అత్యంత కాలుష్యనగరం లాహోర్


లాహోర్, నవంబరు 2: పాకిస్థాన్లోని లాహోర్ నగరం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య నమోదైన గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 530కి చేరింది. గాలిలో అత్యంత సూక్ష్మమైన పీఎం2.5 కాలుష్య కణాల సాంద్రత క్యూబిక్ మీటరుకు 343 మైక్రోగ్రాములుగా నమోదైంది. ఐక్యూఎయిర్ ప్రపంచ నగరాల కాలుష్య ర్యాంకింగ్స్‌లో లాహోర్ అగ్రస్థానంలో నిలిచినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ జాబితాలో ఈజిప్టు రాజధాని కైరో 226 ఏక్యూఐతో రెండో స్థానంలో ఉంది. పాకిస్థాన్లోని పంజాబ్ ప్రావిన్స్ నగరాల్లోనూ వాయు కాలుష్యం తీవ్రంగా ఉంది.

ఆరునౌకల తయారీకి రూ.53,866 కోట్లతో రక్షణశాఖ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 2: దేశ త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లకు అవసరమైన ఆయుధాలు, సైనిక రవాణా వాహనాలు, అధునాతన డ్రోన్ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో నిర్వహించిన డిఫెన్స్ ఆక్విజిషన్ కౌన్సిల్ సమావేశం ఇటీవలే అనుమతులు మంజూరు చేసింది. దీని మొత్తం విలువ రూ. 2.12 లక్షల కోట్లు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం తెలిపింది. దీనికి కొనసాగింపుగా మరో భారీ డీల్ ను కుదుర్చుకుంది రక్షణ మంత్రిత్వ శాఖ. దీని విలువ రూ. 53,866.50 కోట్ల రూపాయలు. నావికా దళం కోసం అత్యాధునిక నౌకలను తయారు చేయడానికి ఉద్దేశించిన కాంట్రాక్ట్ ఇది. ఈ మొత్తంతో ఎనిమిది యుద్ధ నౌకలను తయారు చేస్తారు. దీనికి సంబంధించిన కాంట్రాక్ట్ ను రక్షణ మంత్రిత్వ శాఖ గార్డెన్ రీసెర్చ్ షిప్ బిల్డర్స్, గోవా షిప్ యార్డ్ కు అప్పగించింది. ఈ రెండు సంస్థలతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గార్డెన్ రీసెర్చ్ షిప్ బిల్డర్స్ 5, గోవా షిప్ యార్డ్ 3 యుద్ధ నౌకలను తయారు చేస్తాయి. కాంపిటీటివ్ బిడ్డింగ్ రూపంలో ఈ కాంట్రాక్ట్ ఖరారు కావడం ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలో యుద్ధనౌకల తయారీలో కూడా పోటీ నెలకొనే స్థాయిలో పరిశ్రమలు గానీ, షిప్ యార్డ్స్ గానీ ఎదిగాయన్నారు.

ట్రంప్ నివాసం సమీపంలో కుప్పకూలిన ప్రైవేట్ జెట్

ప్రమాదంలో తొమ్మిది మంది దుర్మరణం



వాషింగ్టన్, నవంబరు 2: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఫ్లోరిడాలోని ట్రంప్ నివాస ప్రాంతానికి సమీపంలో ఓ ప్రైవేట్ జెట్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా స్థానిక కాలమాన ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదం నేపథ్యంలో సమీప రహదారులను మూసివేశారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) వివరాల ప్రకారం.. లియర్‌జెట్ 60 విమానం టెక్సాస్‌లోని ఆస్టిన్-బెర్గ్‌స్ట్రోమ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి బహామాస్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో ఫ్లోరిడాలోని క్రెస్ట్‌హేవెన్ ప్రాంతంలో నేలపైకి దూసుకొచ్చి కూలిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మార్-ఎ-లాగో నివాసానికి ఈ ప్రాంతం సుమారు తొమ్మిది మైళ్ల దూరంలో ఉంది. కాగా, ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విమానం ఆకాశం నుంచి వేగంగా కిందికి దూసుకొచ్చి రహదారి సమీపంలో కూలిన వెంటనే భారీ పేలుడు సంభవించినట్లు ఆ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఘటనాస్థలంలో దట్టమైన నల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడింది. ఈ ప్రమాదంపై ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ స్పందించారు. విమానం కూలిన దృశ్యాలు చూస్తే అది క్షిపణిలా కిందికి దూసుకొచ్చినట్లు ఉందని, శకలాలు అన్నివైపులా ఎగిరిపడ్డాయన్నారు.



చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించిన అమిత్‌షా

ఆలయంలో కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు

హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 2, ప్రభాతవార్త : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరాన్ని సందర్శించారు. అమిత్‌షా పాతనగరానికి విచ్చేసిన సందర్భంగా చార్మినార్ పరిసర ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. బిజెపి సోమవారం నిర్వహించిన మహాపాదయాత్రలో పాల్గొ నటానికి విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరానికి వచ్చారు. భాగ్యలక్ష్మి మందిరం కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు అమిత్‌షాకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గోల్కొండ జోన్ బిజెపి అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర కేంద్ర హోంమంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాకప్పి సన్మానించారు. చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరంలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరంలో కేంద్ర హోం మంత్రి ఏడు నిమిషాలే ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 1.43 గంటల సమయంలో చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరానికి చేరుకున్నారు. పూజ నిర్వహించాక 1.50 గంటల సమయంలో కేంద్రమంత్రి అమిత్‌షా హోటల్ ఐటిసి కాకతీయకు వెళ్లారు. కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు. చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

పంచాయతీరాజ్ మంత్రి సీతక్కతో స్పెషల్ సిఎస్ నవీన్‌మిట్టల్ భేటీ



సోమవారం మంత్రి సీతక్కను సచివాలయంలో కలిసిన పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ నవీన్‌మిట్టల్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: సచివాలయంలో మంత్రి సీతక్కను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా పంచాయతీరాజ్ శాఖకు స్పెషల్ సీఎస్‌గా నియమితులైన నవీన్‌మిట్టల్ ఈ నేపథ్యంలో మంత్రి సీతక్కను సచివాలయంలో పూలమొక్క అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలియ జేశా రు. మంత్రి సీతక్క ఆరోగ్య కరమైన గ్రామాల నిర్మాణంలో ప్రభుత్వ ఆకాంక్షలకు అను గుణంగా పనిచేసి అనుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా పనిచేయాలని సూచించారు.

బాణాసంచా వ్యాపారులతో నిజామాబాద్ కొత్వాల్ భేటీ

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: వచ్చే దీపావళి పండగ నేపథ్యంలో బాణా సంచా విక్రయదారుల అసోసియేషన్ ప్రతినిధులు, హోల్ సెల్ షాపుల యాజమాన్యాలతో నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య సోమవారం నాడు తన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ప్రాతిపదినక లైసెన్స్ తీసుకుని వ్యాపారాలు చేసే వర్తకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆయన కోరారు. బాణాసంచా విక్రయాలకు ముందుగా సంబంధిత శాఖల నుంచి అవసరమైన లైసెన్సులు పొందాలని ఆయన స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమా దాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శి ంచరాదని ఆయన హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని, వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరిస్తూ సురక్షి త వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

డిసెంబరు 9లోగా తొలి దశ, మలి దశ ఉద్యమకారుల డిమాండ్లు అమలుచేయాలి : జెఎసి

హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 2, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను డిసెంబరు 9వ తేదీలోగా అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి డిమాండ్ చేసింది. తొలిదశ, మలిదశ ఉద్యమకారులు నెలకొరిగిపోతున్నారని, కుటుంబాలు రోడ్డుమీదకు వస్తున్నాయని జెఎసి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల ప్రఫుల్‌రామిరెడ్డి, చంద్రశేఖర్ ప్రసాద్, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి డా.ఎం.ఎ.షోయబ్ మాట్లాడుతూ ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగిందన్నారు. ఇటీవల ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కలిసి ఉద్యమ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరిగిందని చెప్పారు. తెలంగాణ సాధించిన ఉద్యమకారులకు ప్రభుత్వాన్ని సైతం ప్రశ్నించి, అవసరమైతే మార్చే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని తెలియజేడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యమకారుల డిమాండ్లు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు తదితర డిమాండ్లను అమలు చేయాలని వారు కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించకపోవడంతో తగిన గుణపాఠం చెప్పడం జరిగిందని, ఈ ప్రభుత్వానికి కూడా తగిన గుణపాఠం చెపుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు రవీందర్‌నాయక్, హరిప్రసాద్, టి.పద్మ, అంజలి, కవిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

రాష్ట్రంలో డిజిటల్ మార్కెట్ యార్డుల ఏర్పాటు

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వ్యవస్థను తెలంగాణలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సచి వాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రైతు పండించిన పంటకు సరైన ధర లభించడంతో పాటు, మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతు మార్కెట్ యార్డులోకి ప్రవేశం చినప్పటి నుంచి పంట విక్రయించి, చెల్లింపులు పొంది బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రైతు వివరాల నమోదు, ప్రతి పంట లాట్‌కు ప్రత్యేక ఐడీ కేటాయింపు, డిజిటల్ బిడ్డింగ్ లేక టెండర్ నమోదు, పంట నాణ్యత పరీక్ష, ఆన్‌లైన్ వేలం, ఛార్జీలు, రైతులకు చెల్లింపులు, పర్మిట్లు, రసీదులు జారీ వరకు అన్ని ప్రక్రియలు ఒకే వేదికపై నిర్వహించేలా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. ఈ విధానంలో రైతు మార్కెట్ యార్డుకు రాగానే అతని వివరాలు నమోదు చేసి, పంటకు ప్రత్యేకమైన లాట్ ఐడీ కేటాయిస్తారన్నారు. అనంతరం పంట నాణ్యతను పరీక్షించి సంబంధిత వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారుని చెప్పారు. వ్యాపారులు ఆన్‌లైన్‌లో లాట్ వివరాలను పరిశీలించి బిడ్లను నమోదు చేస్తారని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చిన పంట వివరాలు, ధరల ధోరణులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల కార్యకలాపాలు, వేలం వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రూపొందించాలన్నారు. ఇందుకు గాను దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న డిజిటల్ మార్కెట్ వ్యవస్థలను అధ్యయనం చేసి, వాటికంటే మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలో ఆదర్శవంతమైన వ్యవస్థను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ శాఖతో సమన్వయం చేసుకొని, వారంరోజుల్లోగా టెండర్లు పిలిచే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వ్యవస్థతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, గోదాముల నిర్వహణ, రోజువారీ కార్యకలా పాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లలో పంటలకు లభిస్తున్న ధరలను ప్రదర్శించాలన్నారు. ప్రతి లావాదేవీకి జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో ఆర్మూర్ -మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు

రెండేళ్లలో పూర్తికి సన్నాహాలు

అటవీభూమి బదలాయింపు, భూసేకరణ పూర్తితో కాంట్రాక్టు ఒప్పందం ఏర్పాటు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: ఆర్మూర్–మంచిర్యాల జాతీయ రహదారి నాలుగు వరుసల విస్తరణ పనులు గోదావరికి సమాంతరంగా బైపాస్‌తో మరో రెండు నెలల్లో హ్యామ్ పద్ధతిలో ప్రారంభమయ్యే అవకా శాలు ఉన్నాయి. ఆర్మూర్ నుంచి క్యాంథంపల్లి (మంచిర్యాల) వరకు 125కి.మి నిడివితో 2529 కోట్లతో హ్యామ్ పద్ధతిలో నాలుగు వరసలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మరో రెండేళ్ళలో నిర్మించనున్నారు. నిజామాబాద్ నుంచి జగద్‌పూర్ 63వ జాతీయరహదారి 485కి.మి నిడివితో నాలుగు వరరసల విస్తరణతో నిర్మించే రోడ్డులో భాగమైన ఆర్మూర్–మంచిర్యాల సెక్షన్ పరిధి 131.89 కిలోమీటర్లకు భోపాల్‌కు చెందిన నిర్మాణ సంస్థ టెండర్ దక్కించు కోవటంతో ప్రక్రియలో వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగిత్యాల పరిధిలోని నేషనల్ హైవే నిర్మాణంకు సంబందించిన 16.1864 హెక్టార్ల అటవీభూమి బదిలీ చేయడంతో మార్గం సుమగం అయింది. నిజామాబాద్ జిల్లా పాడిగెల్, అంకాపూర్, కుక్నూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి బైపాస్‌ల కోసం మొదట 77.26 హెక్టార్లు సేకరించగా బైపాస్ మార్పులతో 83,89 హెక్టార్లు సేకరణ చేశారు. జగిత్యాల జిల్లాలో 378 ఎకరాల భూమి సేకరణ చేశారు. ఒప్పందం పూర్తి అయిన రోజు నుంచి రెండేళ్ల, అయిదు నెలల్లో పనులు పూర్తి చేయాలి. అంతా అనుకున్నట్లు జరిగితే మరో రెండు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రహదారి విస్తరణ పనులకు 2016లో కేంద్ర ప్రభుత్వం భారత్మాల పరియోజన ప్రాజెక్టు కింద గ్రీన్ఫీల్డ్ అలైన్మెంట్ ప్రతిపాదించింది. రాయపట్నం గోదావరి వంతెనకు సమాంతరంగా మరో వంతెన నిర్మించి.. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి గుండానే విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించి 2022లో మార్కింగ్ చేశారు. రాయపట్నం రహదారిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాలకు ఇబ్బంది కల్గించొద్దనే ఆలోచనతో రోడ్డు నమూనాలో మార్పు చేశారు. దీని కోసం కొత్తగా డిపిఆర్ రూపొందించి కమ్మర్‌పల్లి, మెట్‌పల్లి, మేడిపల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు ఆనుకొని ఉన్న బైపాస్ రహదార్ల మీదుగా బుగ్గారం మండలం మద్దునూర్, రాయపట్నం గండి మీదుగా రహదారిని మార్చారు. గోదావరి వంతెన సమీపం నుంచి ప్రభుత్వ భూమి గుండా మోదెల మీదుగా గోదావరికి సమాంతరంగా బైపాస్ నిర్మాణం చేపట్టడానికి వీలుగా డిజైన్ రూపొం దించారు. రోడ్డుకు అవసరమైన అటవీ శాఖ అనుమతులు, కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం, భూ నిర్వాసితులకు అవార్డు ఇవ్వటం ప్రారంభించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పొడిగించాలి

సిఇఒను కోరిన తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కల్వకుంట్ల కవిత

పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి



సిఇఒ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కల్వకుంట్ల కవిత తదితరులు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పొడగించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బీఆర్ కేఆర్‌భవన్‌లో తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డితో ఆమె సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఓటరు నమోదు గడువు పొడగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు ఈనెల 6వ తేదీతో ముగుస్తుందని..ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ కొనసాగే వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఈవో సమావేశం అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 21 వరకు కొనసాగుతుందని, గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు ఈనెల 6వ తేదీతో గడువు ముగిసి పోతుందని పేర్కొనడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు పొడగించాలని తమ సూచనకు సీఈవో అంగీకరించారని తెలిపారు. తమ లాంటి కొత్త పార్టీలకు తమ ఎజెండాను చెప్పుకోవడానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు మంచి అవకాశమన్నారు. రాష్ట్రంలోని మూడింట రెండో వంతు ప్రాంతంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్నదని చెప్పారు. జెన్ జీలు, గ్రాడ్యుయేట్లు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకొని ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించండి

తమ పార్టీ తెలంగాణ రక్షణ సేన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్ లో ఉందని, ఈ విషయంలో తమకు సహకరించాలని సీఈవోను కోరామని కవిత చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షాలకు ధీటుగా తమ ప్రజా సమస్యలపై పోరాడుతున్న తీరును నివేదిక రూపంలో కేంద్ర ఎన్నికల సంఘానికి అందించాలని సీఈవోను కోరామన్నారు. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసినప్పటికీ అన్ని విభాగాల కమిటీలు ఏర్పాటు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ కార్యాకలాపాలు నిర్వహిస్తున్న విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.

నేడు, రేపు తిరువనంతపురంలో పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీల జాతీయ సదస్సు

కేరళం వెళ్లిన రాష్ట్ర పిఎసి కమిటీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ, సభ్యులు, అధికారులు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: పార్లమెంట్, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీల జాతీయ సదస్సు కేరళలోని తిరువనంతపురంలో జరుగనుంది. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరుగున్న ఈ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు తెలంగాణ పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఆరికెపూడి గాంధీ, సభ్యులు చిక్కుడు వంశీకృష ్ణ(ఎమ్మెల్యే), రామారావు పవార్ (ఎమ్మెల్యే), టి.భాను ప్రసాద్‌రావు (ఎమ్మెల్సీ), శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహా చార్యలు, అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి, అసెంబ్లీ అదనపు కార్యదర్శి సిహెచ్ ఉపేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ.సుధాకర్ సోమవారం సాయంత్రం కేరళ వెళ్లారు.

ఖజానాకు పెరిగిన పన్నుల ఆదాయం

జిఎస్టీ, వ్యాట్ ద్వారా రూ.7,735 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా 31 శాతం వృద్ధి నమోదు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: ఎల్‌నినో వల్ల కలిగే ఆర్థిక పరిణామాలు, వర్షపాతం లోటుపై రాష్ట్ర సర్కార్ ఆందోళనలు చెందుతున్న నేపథ్యంలో అందుకు విరుద్ధంగా అక్టోబరు నెలాఖరుకు ఖజానాకు విలువ ఆధారిత పన్ను (జీఎస్టీ) ఆదాయం పెరుగుదల నమోదైంది. వస్తు సేవల పన్ను (వ్యాట్) రాబడులు గణనీయంగా పెరగడంతో అక్టోబర్‌లో తెలంగాణ సొంత పన్ను వసూళ్లు 22 వృద్ధిని నమోదు చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత నెలలో జీఎస్టీ, వ్యాట్, వృత్తి పన్నుల ద్వారా రూ.7,735 కోట్లు వసూలు అయింది. గత ఏడాది ఇదే నెల వసూలు చేసిన రూ.6,332 కోట్లతో పోలిస్తే ఇది రూ.1,403 కోట్లు పెరుగుదలగా రికార్డయింది. వ్యాట్ వసూళ్లు కూడా అత్యధికంగా 31 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇది గత ఏడాది అక్టోబరులో రూ.2,342 కోట్ల ఉండగా, ఈ ఏడాది అదే సమయానికి రూ.3,065 కోట్లకు పెరిగాయి. దీంతో రూ.723 కోట్ల పెరుగుదలగా ఉంది. జీఎస్టీ ఆదాయం 17 శాతం వృద్ధితో రూ.3,914 కోట్లు నుండి రూ.678 కోట్లకు పెరిగి రూ.4,590 కోట్లకు చేరింది. వృత్తి పన్ను వసూళ్లు 5 శాతం వృద్ధితో 76 కోట్ల నుండి రూ.4 కోట్లు పెరిగి రూ.80 కోట్లకు చేరాయి. ఇక ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల కాలంలో స్వంత పన్నుల ఆదాయం బలంగా కొనసాగింది. జీఎస్టీ, వ్యాట్, వృత్తి పన్నుల కింద వసూళ్ళు గత ఏడాది ఇదే కాలానికి రూ.44,598 కోట్లు ఉండగా, అది ఈ ఏడాది ఇదే కాలానికి 17 శాతం మేర రూ.7,512 కోట్లు పెరిగి రూ.52,110 కోట్లకు చేరుకున్నాయి. ఈ కాలానికి జీఎస్టీ వసూళ్లు చూస్తే 19 శాతం పెరిగి రూ.24,974 కోట్ల నుంచి రూ.4,653 కోట్లు పెరిగి రూ.29,627 కోట్లకు చేరాయి. అలాగే వ్యాట్ ఆదాయం 15 శాతంతో రూ.2,844 కోట్లు పెరిగి రూ.19,049 కోట్ల నుండి రూ.21,893 కోట్లకు చేరింది. వృత్తి పన్ను చూస్తే 3 శాతం మేర రూ.15 కోట్లు అదనంగా పెరిగి రూ.575 కోట్లు నుండి రూ.590 కోట్లకు చేరుకుంది. పండుగ సీజన్‌లో వస్తువులు, సేవలపై ఖర్చు సాధారణంగా పెరుగుతుంది కాబట్టి వీటి వసూళ్లు పెరుగుదలకు కారణమైందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

సమరోత్సాహంతో తిరిగి రాష్ట్రానికి చేరుకున్న కాంగ్రెస్ నేతలు

అడ్డంకులను అధిగమించి ఢిల్లీ సభను విజయవంతం చేసిన కార్యకర్తలు

హైదరాబాద్, నవంబరు 2,ప్రభాతవార్త: ఓటుబచావో దేశ్‌బచావో అంటూ తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు దేశరాజధాని హస్తివీధిలో పద్మవ్యూహం దాటి చెలరేగిన అభిమన్యుల వలె ఆదివారం కదం తొక్కి "సత్యాగ్రహ" నిరసన విజయవంతం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఢిల్లీలో నిర్వహించిన ఓట్ బచావో – దేశ్ బచావో భారీ బహిరంగ సభలో తెలంగాణ కాంగ్రెస్ తన ఐక్యతను, సంస్థాగత బలాన్ని చాటుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయస్ఫూర్తి, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ నుంచి 15 వేల మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఢిల్లీకి తరలివెళ్లి సభ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వంలో, ఎఐసిసి అగ్రనేత సోనియా గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన ఈ సభకు దేశ వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఎన్నికల సంఘం పని తీరులో పారదర్శకత, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో అవకతవకలున్నాయంటూ కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలపై ప్రజలకు వివరించడమే సభ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి తరలివెళ్లేందుకు సిద్ధమైన నేపథ్యంలో ప్రత్యేక రైళ్ల కేటాయింపు విషయంలో చివరి నిమిషంలో రైల్వే అధికారులు అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు వెనుకడుగు వేయకుండా ప్రత్యేక బస్సులు, కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాలు, విమానాల ద్వారా ఢిల్లీకి చేరుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ పిలుపును గౌరవిస్తూ స్వచ్ఛందంగా తరలివెళ్లడం తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తల అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. ఢిల్లీకి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ప్రయాణం, వసతి తదితర అంశాల్లో ఇబ్బందులు కలగ కుండా తెలంగాణ కాంగ్రెస్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు రామ్‌లీలా మైదానంలో జరిగిన సభలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ప్రత్యేక రైళ్లు లేకున్నా హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి రైల్ మార్గం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. 100 పైగా బస్ లతో పాటు కార్లు ఇతర వాహనాలు, విమానాలలో భారీగా తరలివెళ్లారు. ఢిల్లీకి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులకు అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పిసిసి పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. 800 లకు పైగా అద్దె గదులు, భోజన సౌకర్యాలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి వివిధ మార్గాలలో 15 వేలకు పైగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో తెలంగాణ రాష్ట్రం ముందుంటుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు.ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ ప్రదర్శించిన ఐక్యత, క్రమశిక్షణ, సమన్వయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం, కార్యకర్తల సమష్టి కృషి ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ భాగస్వామ్యాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా సాగుతున్న ఈ పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ తన వంతు బాధ్యతను బలంగా చాటుకోవడమే కాదు కేంద్ర ప్రభుత్వంపై పోరుకు సమరోత్సాహం ప్రదర్శించే నైతిక స్థైర్యం కూడా కూడగట్టుకొనే అవకాశం ఏర్పడింది.



సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన భాగ్యలక్ష్మి ్మ ఆలయ ట్రస్టీ శశికళ తదితరులు

గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో పలువురు ప్రముఖుల భేటీ

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: గవర్నర్ శివప్రతాప్ శుక్లాను పలువురు ప్రముఖులు సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రి జె.గీతారెడ్డి గవర్నర్‌ను కలిశారు. జె ఈశ్వరీభాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబరు 1న నిర్వహించే 108వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. 2026లో పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ పి.విజయ్ ఆనంద్‌రెడ్డి, అసోసియేషన్ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజిస్ట్స్ కాన్ఫరెన్స్–2026 ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ హోదాలో గవర్నర్‌తో భేటీ అయ్యారు. అలాగే, హైదరాబాద్ చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ పలువురితో కలిసి గవర్నర్‌ను కలిశారు. ఆదిత్యబిర్లా మేనేజ్ మెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ ప్రెసిడెంట్ రవిశంకర్ పలువురితో కలిసి గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

ఎపి లిక్కర్ స్కాంలో మరో నిందితుడిని అరెస్టు చేసిన ఇడి

నాంపల్లి కోర్టులో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: వైసిపి హయాంలో ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి మరో నిందితుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డిని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ హైదరాబాద్ విభాగం అధికారులు సోమవారం నాడు విజయవా డలో అరెస్టు చేశారు. అనంతరం అతన్ని నేరుగా నాంపల్లిలోని ఈడీ కోర్టులో హాజరు పరిచగా ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నిందితు డికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా కిరణ్‌కుమార్ రెడ్డి లిక్కర్ స్కాం కేసు లో ప్రధాన సూత్రధారిగా వున్న రాజ్‌కసిరెడ్డికి ముఖ్య అనచరుడుగా కావడం గమనార్హం. లిక్కర్ స్కాంలో కిరణ్‌కుమార్ రెడ్డిని మరింతగా వి చారించేందుకు రెండు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈడీ అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీక రించిన కోర్టు విచారణను వాయిదా వేసింది.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రాంబాబు

ఐడిబిఐ బ్యాంకును అమ్మడం దేశద్రోహమే

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రాంబాబు

హైదరాబాద్ (ధర్నాచౌక్), నవంబరు 2, ప్రభాతవార్త: జాతీయ సంపదైన ఐడిబీఐ బ్యాంకును అమ్మటం దేశద్రోహమేనని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు బి.ఎస్.రాంబాబు స్పష్టం చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఐడిబీఐ అధికారులు, ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. రెండు రోజులపాటు కొనసాగే దీక్షా కార్యక్రమాన్ని రాంబాబు ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకులు అమ్ముకోవాల్సిన ఆస్తులు కాదని, అవి దేశాన్ని నిర్మించే సాధనాలను అన్నారు. జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోలన వ్యక్తం చేశారు. లక్ష కోట్లకు పైగా విలువ ఉన్న ఐడీబీఐ బ్యాంకును కేవలం 52,878 కోట్ల ప్రతిఫలంతో 60.72 శాతం వాటాను అమ్మటం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం ఛైర్మన్ వి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఐడిబీఐ విక్రయ ప్రక్రియను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వమే ఐడీబీఐ బ్యాంకును నడపాలని డిమాండ్ చేశారు. దీక్షా కార్యక్రమంలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్, బి.ఈ.ఎఫ్.ఐ.అధ్యక్షులు వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పత్తికి కూలీల విపత్తు

39లక్షల మె.ట దిగుబడి మార్కెట్కు చేరేదెలా?: రైతు ఆందోళన

మిర్చి, పెసర పంటకు కూడా వెంటాడుతున్న కూలీల సమస్య

ముంచుకొస్తున్న మురసు తుఫాను

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: అర్నబ్ తుఫాను తరువాత మురసు తుఫాను ముంచు కొస్తుండటంతో తెలంగాణ వ్యాప్తంగా తెల్ల బంగారంగా పిలిచే వాణిజ్య పంటసాగుచేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. పత్తిఏరివేతకు కూలీల కొరతతో 39లక్షల మె.ట దిగుబడి పత్తి చేను గడప దాటడంలేదు. వాణిజ్య పంటల్లో ప్రధానమైన తెల్లబంగారం ఆదిలాబాద్, కరీంనగర్,వరంగల్ జిల్లాలతో పాటు అనేక జిల్లాల్లో సాధారణంగా 47,41,541ఎకరాలలో సాగుచేస్తారు. ఈ యేడు వర్షాభావం ఉన్నప్పటికి 48,33,112 ఎకరాలలో పత్తిని సాగుచేశారు. 38,66,490 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అవుతోందని మార్కెటింగ్శాఖ అంచనావేస్తున్నది. తుఫాను ప్రమాదఘంటికలు మోగిస్తున్న వేళ పత్తితీతకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మేఘావృతమైన ఆకాశం, వాతావరణ పరిస్థితులు రైతులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఏ గ్రామంలో చూసిన పంట క్షేత్రాలు తెల్లగా నిండు పత్తితో దర్శనమిస్తున్నాయి. సకాలంలో లభించని కూలీల కారణంగా చేను దాటని పత్తి పంట ఆందోళన కలిగిస్తోంది. మార్కెట్లో గిట్టుబాటు ధరలు పలుకుతుండటంతో సకాలంలో సొమ్ము చేసుకుందామని భావిస్తున్నా ప్రతికూల పరిస్థితులతో సతమతమవుతున్నారు. పత్తితో పాటు మిరప,పెసర పంట వేసిన రైతులుకూడా ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణలో 3,56,820టన్నుల మిరప దిగుబడి అవుతోంది. ఆంధ్రప్రదేశ్ తరువాత తెలంగాణ రెండోస్థానంలో ఉంటుంది. ఎనుమాముల మార్కెట్లో పత్తి, మిరప పంటలు ఎక్కువగా రైతులు విక్రయిస్తారు, ఒక లక్షా 51వేల ఎకరాలలో మిర్చి సాగుచేస్తారు. అకాల వర్షం కురిస్తే నాణ్యతపై ప్రభావం చూపుతుంది. ఈ పరిణామం కర్షకులను ఇబ్బంది పెడుతోంది. పత్తితీతకు కూలీల కొరత, యంత్రీకరణ సదుపాయం లేమి, వాతావరణ పరిస్థితులు, తదితర సమస్యలతో ఆందోళన తప్పడం లేదు. వరి, సోయా, వేరుశనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, ఆముదం నువ్వులు,పొద్దుతిరుగుడు పువ్వు,రాగి, ఇతరత్రా ఆహార పంటలకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. నూర్పిడి పనులు సులువుగా అవుతున్నాయి. కేవలం పత్తితీతకు మాత్రమే శ్రామిక శక్తిఅవసరమవుతోంది. వరి పంట ఖరీఫ్లో సాధారణంగా 6595645 ఎకరాలలో సాగు చేస్తారు. గత ఏడాది 67,73,484 ఎకరాలలో సాగుచేస్తే ఈయేడు వర్షాభావంతో 56,79,969 ఎకరాలలో సాగుచేశారు తుఫాను ముప్పు పొంచి వున్నా వాటిని కోసేందుకు యంత్రాలు ఉండటంతో కూలీల కొరత వెంటా డటం లేదు.ప్రస్తుతం వరిధాన్యం 11359938 మె.ట దిగుబడి అవుతోందని ప్రభుత్వం అంచావేస్తోంది.సోయా372424 ఎకరాలలో సాగుచేయగా 260697 మె.ట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మొక్కజొన్న 593221 ఎకరాలలో సాగు చేయగా 11,86,442 మె.ట అంచనా దిగుబడి ఉంది. జొన్న 35,437ఎకరాలు సాగుచేయగా 21,262 మె.ట దిగుబడి రానున్నది. పెసర1,60,675 ఎకరాలలో సాగుచేయగా 48,203 మె.ట దిగుబడి అయ్యే అవకాశం ఉందని మార్కెటింగ్శాఖ లెక్కిస్తోంది.మినుము 73,834 ఎకరాలలో సాగు చేయగా29534 మె.ట దిగుబడి కానున్నది. కంది 5,58,177 ఎకరాలు సాగు చేయగా 1,95,362 మె.ట దిగుబడి అయ్యే అవకాశాలు ఉన్నాయి.వేరుశనగ20,365 ఎకరాలలో సాగు చేయగా18329 మె.టన్నులు దిగుబడి అవుతాయనీ అంచనా వేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 14రకాల ఆహార పంటలు ఈ ఖరీఫ్లో 1,69,88,242 మె.ట దిగుబడి అవుతున్నాయి కానీ 39లక్షలమె.ట పత్తిని ఏరడానికి కూలీలు దొరకడంలేదు గతంలో రైతులు ఇంటిల్లిపాది పనులు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. దీంతో పరస్పర బదిలీలు సైతం లేకుండాపోయాయి. పత్తితీతకు వంద శాతం కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గతంలో మహారాష్ట్ర వలస కూలీలు వస్తే పనులు సకాలంలో పూర్తయ్యేవి.

ప్రస్తుతం వారి రాక సైతం కొంత మేర తగ్గింది. ఉన్న కొద్దిపాటి కూలీలకు డిమాండ్ అధికంగా ఉండటంతో కూలీ ధరపై ప్రభావం చూపుతోంది. దీంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

ఏమి చేయలేని పరిస్థితుల్లో వేచి చూసే ధోరణిలో ఉండిపోతున్నారు.



సోమవారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దంపతులను కలిసి తన కుమార్తె వివాహానికి ఆహ్వానిస్తున్న ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల

సిఎం రేవంత్రెడ్డిని కలిసిన షర్మిల

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని సోమవారం మర్యావపూర్వకంగా కలిశారు. తన కుమార్తె అంజిలి రెడ్డి వివాహ రిసెప్షన్కు సిఎంను ఆహ్వానించారు. డిసెంబర్ 5న షర్మిల కూతురు అంజిలి రెడ్డి, రఘు రామ్ రెడ్డిల వివాహ రిసెప్షన్ ఉంది. కాగా, అంతకు ముందు ఉదయం వై.ఎస్. షర్మిల.... రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ మంత్రికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి, మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.



సోమవారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కలిసి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్న సత్యసాయిబాబా మేనేజింగ్ ట్రస్టీ ఆర్జె రత్నాకర్ తదితరులు

సిఎం రేవంత్రెడ్డిని కలిసిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: 23న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మదినాన్ని పుర స్కరించుకుని నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. సోమవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్ జి చలం, ఇతర సభ్యులు ముఖ్యమంత్రిని కలిసి ఆ మేరకు ఆహ్వానాన్ని అందించారు.

ఫాక్స్ సాగర్ ఎఫ్టిఎల్ పరిధిలో అక్రమ కట్టడాలు

మాజీ మంత్రి మల్లారెడ్డి ఫామ్హౌస్ ప్రహరీ గోడ కూల్చివేసిన హైడ్రా



హైదరాబాద్, నవంబర్ 2, ప్రభాతవార్త: ఫాక్స్ సాగర్ అభివృద్ధిని హైడ్రా చేపట్టింది. చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోకి వచ్చిన ఆక్రమణలను తొలగించి పునరుద్ధరణకు అడుగులు వేస్తోం ది. ఆ క్రమంలో ఫాక్స్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ కట్టడాలను హైడ్రా సోమవారం తొలగించింది. ఎఫ్టీఎల్ పరిధి లో ఏకంగా అర కిలోమీటరు మేర బండ్ నిర్మించడాన్ని హైడ్రా సీరియస్గా పరిగణించింది. ఆ బండ్ను హద్దుగా ఫామ్ హౌస్ నిర్మాణానికి గాను కట్టిన ప్రహరీని హైడ్రా కూల్చి వేసింది. కొన్ని చోట్ల హద్దుగా వేసిన ఇనుప కంచెను కూడా తొలగించింది. ఫాక్స్ సాగర్కు మరోవైపు ఎఫ్టీఎల్ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డి ఫామ్ హౌస్ ప్రహరీని కూడా హైడ్రా కూల్చివేసింది. ఎఫ్టీఎల్, బఫర్ పరిధిలో మట్టిని నింపి ప్రహరీ నిర్మించి.. గేటు ఏర్పాటు చేయగా.. హైడ్రా వాటిని తొలగించింది. దూలపల్లి విలేజ్లో చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబీకులకు సంబంధించిన ఫామ్ హౌస్ ఉంది. సర్వే నంబరు 124లో ఫాక్స్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధి ఉండగా..వాటిని పట్టించుకోకుండా ప్రహరీ నిర్మించి గేటు పెట్టడాన్ని హైడ్రా సీరియస్గా పరిగణించింది. ఎఫ్టీఎల్ హద్దుల్లో ఉండడంతో ప్రహరీని తొలగించి నట్టు హైడ్రా స్పష్టం చేసింది. ఇలా దాదాపు 15 ఎకరాల వరకూ ఫాక్స్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలోకి జరిగి మల్లారెడ్డి కుటుంబీకులు ప్రహరీ నిర్మించినట్టు తేలింది. జీడిమెట్ల సర్వే నంబరు 41, 42లలో 20 ఎకరాల మేర ఫాక్స్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో వచ్చిన ప్రహరీని కూడా హైడ్రా తొలగించింది.

జెన్కో తాడిచెర్ల బొగ్గు గనికి ప్రతిష్టాత్మక అవార్డు

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)కు చెందిన బొగ్గు గనికి జాతీయ అవార్డు లభించింది. రాష్ట్రంలోని జెన్కో నిర్వహణలోని తాడిచెర్ల ఓపెన్కాస్ట్ బొగ్గు గనికి 2024-25 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన 5స్టార్ రేటింగ్ అవార్డు దక్కింది. బొగ్గు గనుల నిర్వహణ, భద్రత, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరమైన గనుల తవ్వక విధానాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ రాయపూర్లో సోమవారం జెన్కోకు ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు.

19 నుంచి 22 వరకు హైదరాబాద్లో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు

- ఐఆర్సి సదస్సును తెలంగాణ ప్రగతికి, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా మలచాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రేవంత్రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం: కోమటిరెడ్డి

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షి ంచి, ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షి ంచారు. ఆల్వాల్ టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి,నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రజలకు మెరుగైన రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని, ఇందుకు సంబంధించిన ప్రతి ప్రాజెక్టును అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్లోని హైటెక్స్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్సి) గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షి ంచారు.అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వివరించగా, మంత్రి పలు కీలక సూచనలు చేశారు.

టెక్నాలజీకి అనుగుణంగా ముందుకు సాగాలి, ఎఐ భూతం కాదు,మానవాళికి దూతం: కెటిఆర్

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. విద్యావ్యవస్థలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ భూతం కాదని, మానవాళికి దూతం లాంటిదని వ్యాఖ్యానించారు. నానక్రామ్గూడలో సోమవారం క్యాంపస్ హబ్ ఎఐని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రామీణ నేపథ్యం ఉన్న నలుగురు యువకులు కలిసి కొత్త టెక్నాలజీ వేదికను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వారు నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

కట్టంగూర్ వద్ద ఘోర ప్రమాదం

ఇద్దరు దుర్మరణం, ఒకరికి తీవ్రగాయాలు

కట్టంగూర్,నవంబర్ 2,ప్రభాతవార్త: హైదరాబాద్ విజయవాడ 65 నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని చెరువు అన్నారం క్రాస్ రోడ్ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, క్షతగాత్రుడు ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వాసు (22), అతనికి సోదరుడు వరస అయ్యే జొన్నలగడ్డ ప్రశాంత్ లు గత కొంతకాలంగా హైదరాబాదులో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.వీరు తమ స్వగ్రామానికి వెళ్లేందుకు సోమవారం హైదరాబాదు నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో నార్కెటపల్లి వద్ద హైవేపై నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన గోగుల స్వాతి (30) వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనకు నకిరేకల్ వరకు లిఫ్ట్ ఇవాల్సిందిగా కోరగా ముగ్గురు కలిసి నకిరేకల్ వైపు వెళ్తుండగా మండల పరిధిలోని చెరువు అన్నారం క్రాస్రోడ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్టేక్ చేసే క్రమంలో వెనకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి పైనుంచి వెళ్లడంతో జొన్నలగడ్డ వాసు, గోగుల స్వాతిలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

రాష్ట్రంలో అక్రమ మైనింగ్కు అడ్డుకట్ట ఆదాయానికి గండి కొట్టేవాటికి చెక్

అందుబాటులో ఇంటెగ్రేటెడ్ గ్రావెల్ పర్మిషన్ పోర్టల్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త తెలంగాణలో జరుగుతున్న అక్రమ మైనింగ్కు అడ్డుకట్ట వేయడంతో పాటు, ఆదాయానికి గండి కొట్టేవాటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో మట్టి (గ్రావెల్) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో నూతనంగా పోర్టల్ను తీసుకువచ్చినట్లు రాష్ట్ర మైనింగ్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమీకృత గ్రావెల్ (మట్టి) ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్ను ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా ఆయా అనుమతుల కోసం తమ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా సులభంగా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కలిపించారు. దరఖాస్తులు సంబంధిత అధికారులకు చేరతాయని, రెవెన్యూ భూములకు సంబంధించిన అనుమతులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి. నీటిపారుదల శాఖకు సంబంధించిన అంశాలుంటే ఆ శాఖ లాగిన్ అయి దరఖాస్తును వారి అనుమతికి పంపించడం జరుగుతుంది. దరఖాస్తు సమయంలో ఎక్కువ వివరాలు అడగకుండా ప్రాథమికంగా ఆధార్, తదితర వివరాలతో పాటు, గ్రావెల్ ఎక్కడి నుంచి తీసుకోవాలనుకుంటున్నారనే వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది. సొంత పట్టా భూమి నుంచి గ్రావెల్ తీసుకోవాలనుకుంటే పట్టాదారు పాస్బుక్ కాపీని, ఇతరుల పట్టా భూమి నుంచి తీసుకోవాలనుకుంటే సంబంధిత భూ యజమాని నుండి సమ్మతి పత్రాన్ని ఈ పోర్టల్లో అప్లోడ్ చేయాలి. ప్రభుత్వ భూముల విషయంలో సర్వే నంబర్, జియో కోఆర్డినేట్స్ తదితర వివరాలను విధిగా సమర్పించాలి.. దరఖాస్తుల పరిశీలన కోసం రెవెన్యూ శాఖకు మూడు పేజీల చెక్ లిస్ట్ను కూడా అందుబాటులో ఉంచారు. మట్టి (సిల్ట్) కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భాల్లో రెవెన్యూ శాఖకు, దానిని నీటిపారుదల శాఖకు ఫార్వర్డ్ చేసే అవకాశం ఉంటుంది. అనుమతి మంజూరైన తర్వాత పూర్తి వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుంది.

మైలార్దేవ్పల్లిలో విషాదం

మూడోతరగతి బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్య

మైలార్దేవ్పల్లి,నవంబరు 2 ప్రభాతవార్త : మూడవ తరగతి చదువుచున్న ఎనిమిది సంవత్సరాల వయస్సుగల బాలుడు ఇంట్లో ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం...ఉత్తర్ప్రదేశ్లోని ప్రతాప్గఢ్కు చెందిన సూరజ్ సింగ్ బతుకు దెరువు కోసం కొన్ని సంవత్సరాలు క్రితం మైలార్దేవ్పల్లిలోని లక్ష్మీగూడకు వచ్చాడు.కొడుకు ఆరమ్ సింగ్,(8) కూతురు (5),భార్యతో కలిసి లక్ష్మీగూడ్లో నివాసం ఉంటున్నాడు.సూరజ్ సింగ్ కుమారుడు మూడవ తరగతి చదువుచున్నాడు.భార్యాభర్త లిద్దరూ కాటేదాన్లో ఓ ఫ్యాక్టరీలో కూలీలుగా పని చేస్తున్నారు.ప్రతీ రోజు మాదిరిగానే సూరజ్ సింగ్ భార్యతో కలిసి ఆదివారం పని కోసం ఫ్యాక్టరీకి వెళ్లాడు.కాగా కుమారుడు ఆరమ్ సింగ్ ఇంట్లో ఫ్యాన్కు ఉరి వేసుకని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన భార్యాభర్తలిద్దరికి ఇంట్లో ఫ్యాన్కు కొడుకు ఆరమ్సింగ్ ఉరేసుకుని కనిపించాడు.కుమారుడు మృతి చెందటంతో భార్యాభర్తలిద్దరూ గుండెల విసెలా రోధించారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ్థలానికి చేరుకుని అరమ్సింగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.సోమవారం పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు రూ.150 కోట్ల నిధులు విడుదల

హైదరాబాద్, నవంబర్ 2,ప్రభాతవార్త: నగర వాసులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 కోసం రూ.150 కోట్ల నిధులు విడుదల చేసింది. రుణం రూపంలో నిధుల విడుదలకు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. 2026-27 బడ్జెట్లో మెట్రోకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో తొలి విడతగా రూ.125 కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెం.990 జారీ చేసింది. అలాగే ప్రతి నెలా నిధుల వినియోగంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిధులతో మెట్రో విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్2లో భాగంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్పోర్టు, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మియాపూర్ -పటాన్చెరు, ఎల్బీనగర్ -హయత్నగర్ కారిడర్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. అలాగే శంషాబాద్ ఎయిర్పోర్టు-భారత్ ఫ్యూచర్సిటీ, జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్ -శామీర్పేట్ కారిడర్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించింది.

సంక్షేమ గురుకులాల సరకుల్లో జాప్యం వద్దు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త సంక్షేమ గురుకులాల విద్యార్థులకు అవసరమైన కిరాణా, కూరగాయలు, నిత్యావసరాలు, ఇతర వినియోగ వస్తువుల సరఫరాలో ఎలాంటి జాప్యం ఉండకూడదని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గుగులోతు రవి ఆదేశించారు. పనితీరు, సరఫరా వ్యవస్థపై హైదరాబాద్ మాసాబ్ టాంక్లోని సంక్షేమ భవన్లో సోమవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండెంట్ మేరకు సరైన పరిమాణంలో, నిర్ణీత గడువులో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సరుకులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. నాణ్యత లోపం ఉంటే వెంటనే వాటిని తిరిగి పంపాలని స్పష్టం చేశారు. సరుకుల పంపిణీలో జాప్యం లేకుండా ప్రతి స్టోరేజ్ పాయింట్ వద్ద ఇద్దరు బాధ్యులైన సిబ్బందిని నియమించాలని చెప్పారు. సరుకులు అందకపోవడం, ఆలస్యం కావడం, పరిమాణం లేదా నాణ్యతలో తేడాలు ఉండటం వంటి ఫిర్యాదులను అక్కడికక్కడే నమోదు చేసి పరిష్కరించాలన్నారు. ప్రతి స్టోరేజ్ పాయింట్లో రోజువారీ ఫిర్యాదుల రిజిస్టర్ నిర్వహించాలని తెలపారు. రోజుకు ఏ గురుకులం నుంచి ఎన్ని ఫిర్యాదులు ఏ ఏ సమస్యలపై వచ్చాయి, వాటిపై తీసుకున్న చర్యలు, పరిష్కరించిన తేదీ, పెండింగ్లో ఉన్న ఫిర్యాదులు తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు. పదేపదే వస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, జోనల్, రీజినల్ అధికారులు స్టోరేజ్ పాయింట్లను తరచూ తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పీఎంయూ ద్వారా సరఫరా బాధ్యతలు నిర్వహిస్తున్న వితిదివీనీ నిర్ణీత సరఫరా షెడ్యూల్ను కచ్చితంగా పాటించాలన్నారు. టెండర్ నిబంధనలు, ఒప్పంద షరతులు, ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగానే సరఫరా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి ్మ, బీసీ సంక్షేమ గురుకుల కార్యదర్శి సైదులు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలోని ఐదు గనులకు జాతీయ అవార్డులు

కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్న సిఎండి డాక్టర్ ప్రకాష్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త ఉత్తమ మైనింగ్ పద్ధతులు, పర్యావరణ హిత చర్యలు, కార్మికుల సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 5 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. ఛత్తీస్గఢ్లోని రాయ్పూర్లో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఈ అవార్డులను అందుకున్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్ను ఇస్తుంది. స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తుంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో ఆయా అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుంచి వచ్చిన పరిశీలక బృందం ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతుంది.

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్టును ఉపసంహరించుకోవాలి :హైదరాబాద్ ప్రెస్ క్లబ్

హైదరాబాద్,నవంబర్,2, ప్రభాతవార్త: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) యాక్ట్ను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది. డిపిడిపి యాక్ట్ను రద్దు చేయాలన్న డిమాండ్ తో జాతీయ స్థాయిలో అన్ని క్లబ్ను యూనియన్లతో కలిపి భారీ స్థాయిలో ఉద్యమం రూపొందించాలని ప్రెస్ క్లబ్ నిర్ణయించింది. సోమాజిగూడ లో సోమవారం నాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ప్రత్యేకంగా సమావేశమైంది. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ ,అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్. ఉమాదేవి, మర్యాద రమాదేవి, శంకర్ శిగ, వనం నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, రచన ముడుంబై, అశోక్ దయ్యాల, ముత్యాల సత్తిబాబు, అమిత్ బట్టు పాల్గొన్నారు. జర్నలిస్టుల హక్కులను హరించే విషపూరిత చట్టాలను విరమించుకునేంతవరకు ప్రెస్ క్లబ్ పోరాటం చేయాలని నిర్ణయించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ వల్ల పరిశోధనాత్మక జర్నలిజం పై ఈ చట్టం గొడ్డలి పెట్టు కానుందని, సమాజానికి మంచి వార్తలు రాకుండా ఈ చట్టం అడ్డుపడుతుందని ప్రెస్ క్లబ్అభిప్రాయపడింది. జర్నలిస్టుల సమస్యలను నిర్ణీత కాల పరిమితిలో పరిష్కరించాలని, సోమాజిగూడ లోని స్థలాన్ని ప్రెస్ క్లబ్ కు లీజు ఇవ్వాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ప్రెస్ క్లబ్ లీజు స్థలం కేటాయింపు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు, వయోవృద్ధ జర్నలిస్టులకు పింఛన్లు మంజూరు చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేసింది.

బల్గేరియా తొలి మహిళా ప్రెసిడెంట్గా ఇలియానా యోటోవా



సోఫియా, నవంబరు 2: బల్గేరియా రాజకీయాల్లో చారిత్రాత్మక పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ తొలి ఎన్నికైన మహిళా అధ్యక్షురాలిగా తాత్కాలిక అధ్యక్షురాలు ఇలియానా యోటోవా ఎన్నికయ్యారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, దేశంలో జాతీయ ఐక్యత సాధించేందుకు కృషి చేస్తానని ఆమె ప్రకటించారు. సోమవారం ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం యోటోవాకు 57.6 శాతం ఓట్లు లభించాయి. ఉదారవాద, పాశ్చాత్య అనుకూల ప్రతిపక్ష అభ్యర్థి ఆండ్రే గ్యూరోవ్కు 39.5 శాతం ఓట్లు వచ్చాయి. ఓటమిని అంగీకరించిన గ్యూరోవ్ మాట్లాడుతూ, బల్గేరియా ప్రజలు తమ తీర్పును ఇచ్చారని, ఫలితాలను గౌరవించాలని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం యోటోవా మాట్లాడుతూ, ప్రజల కోసం పనిచేసే సంస్థలు, సొంత విదేశాంగ విధానం కలిగిన బలమైన దేశం, శక్తిమంతమైన ఐరోపా కోసం చర్చల ద్వారా జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు నేను ఓటు వేశానని తెలిపారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ యోటోవాకు అభినందనలు తెలిపారు. భద్రత, రక్షణ, పోటీతత్వం, ఇంధన స్వావలంబన వంటి అంశాల్లో కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. బలమైన ఐరోపాలో బలమైన బల్గేరియా పేర్కొన్నారు.


పది మంది రైల్వే ఉద్యోగులకు భద్రతా పురస్కారాలు

దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

తార్నాక, నవంబరు 2 ప్రభాతవార్త : విధి నిర్వహణలో అప్రమత్తత, అంకితభావంతో రైలు ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషించిన పది మంది ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ భద్రతా పురస్కారాలను ప్రదానం చేశారు. సోమవారం సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో నిర్వహించిన భద్రతా సమీక్షా సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు.ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.


నియామకాలు, బదలీలు, ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఆదేశం

హైదరాబాద్,నవంబరు2,ప్రభాతవార్త: నియామకాలు, బదిలీలు, ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలపై స్పష్టతనిస్తూ సాంఘిక సంక్షేమశాఖ మెమో జారీ చేసింది. నిబంధనల అమలులో నిర్లక్ష ్యం చేస్తే చర్యలు తప్పవన్న హెచ్చరించింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్కు మాదిగ ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



కొరియా ఓపెన్ నుండి లక్ష్య, సింధు ఔట్

న్యూఢిల్లీ: హైలో ఓపెన్ 2026 ఫైనల్‌లో టైటిల్స్‌ను కైవసం చేసుకున్న లక్ష్య సేన్, పివి సింధులు నవంబర్ 3 నుంచి 8 మధ్య జరగనున్న కొరియన్ ఓపెన్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. హైలో ఓపెన్ ఫైనల్‌లో జోనాటన్ క్రిస్టీని ఓడించి ఈ ఏడాది తన తొలి బిడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను కైవసం చేసుకున్న లక్ష్య కొరియన్ ఓపెన్‌కు దూరంగా ఉండనున్నాడు. చైనాకు చెందిన డాంగ్ టియాన్ యావోతో తన ప్రచారాన్ని ప్రారంభించాల్సిన ఈ భారత షట్లర్, ఈ నెల చివరలో జరిగే జపాన్ మాస్టర్స్‌లో తిరిగి కోర్టులోకి అడుగుపెట్టనున్నాడు. ఇక హైలో ఓపెన్ 2026లో మహిళల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న పి.వి. సింధు కూడా జపాన్ మాస్టర్స్‌తో పాటు, కొరియన్ ఓపెన్ టోర్నమెంట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఇదే సమయంలో ఆమె బాటలోనే లక్ష్య కూడా ఈ టోర్నమెంట్ నుండి వైదొలగాడు. కాగా ఈ టోర్నమెంట్‌కు సంబంధించి లక్ష్య అత్యుత్తమ ప్రదర్శన 2022 సీజన్‌లోనే నమోదైంది. ఆ సీజన్‌లో అతను ఇండోనేషియాకు చెందిన షెసర్ హిరెన్ రుస్తావిటో చేతిలో ఓడిపోవడానికి ముందు టోర్నమెంట్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. 2026 ఎడిషన్‌లో లక్ష్య ఐదవ సీడ్‌గా ఉండేవాడు. అతను వైదొలగడంతో, పురుషుల సింగిల్స్‌లో భారత సవాలుకు హెచ్‌ఎస్ ప్రణయ్ నాయకత్వం వహించనున్నాడు. అతను దక్షిణ కొరియాకు చెందిన యూ టే బిన్‌ను ఎదుర్కోనున్నాడు.



న్యూ ఇంగ్లాండ్‌పై మయామి గెలుపు

చివరి నిముషాల్లో విజయాన్నందించిన మెస్సీ

మసాచుసెట్స్: రెగ్యులర్ సీజన్‌లో ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే, ఇంటర్ మయామి (59 పాయింట్లు) న్యూ ఇంగ్లాండ్ (58 పాయింట్లు)ను అధిగమించి ఈస్టర్న్ కాన్ఫరెన్స్‌లో రెండవ స్థానానికి చేరుకుంది. ఇంటర్ మయామి తరఫున 69వ నిమిషంలో జర్మన్ బెర్టెరామే సాధించిన సమం చేసే గోల్‌కు లియోనెల్ మెస్సీ నిర్ణయాత్మక సహకారం అందించి చివరి నిముషాల్లో విజయానికి కారణమయ్యాడు. మసాచుసెట్స్‌లోని ఫాక్స్‌బరోలోని జిల్లెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ మ్యాచ్‌లో, లియోనెల్ మెస్సీ 83వ నిమిషంలో తన ఎమ్మెల్ఎస్‌లో అత్యధికంగా 26వ గోల్ సాధించి, అతిథి జట్టు ఇంటర్ మయామిని న్యూ ఇంగ్లాండ్ రెవల్యూషన్‌పై 2-1 తేడాతో గెలిపించాడు. 53వ నిమిషంలో డేనియల్ గాజ్‌డాగ్ గోల్ చేసినప్పటికీ, 75వ నిమిషంలో ఆధిక్యంలో లేదా సమంగా ఉన్నప్పటికీ, న్యూ ఇంగ్లాండ్ తన నాలుగుమ్యాచ్‌ల విజయ పరంపరను కొనసాగించడంలో విఫలమై, ఈ సీజన్‌లో మొదటిసారి ఓడిపోయింది. 87వ నిమిషంలో రెవల్యూషన్ జట్టుకు లభించిన ఓన్‌గోల్ సమం చేసే గోల్‌ను వీడియో సమీక్ష తర్వాత రద్దు చేశారు, ఆ సమయంలో లూకా లాంగోని ఆఫ్ సైడ్‌లో ఉన్నాడని రెఫరీ సెర్గీ బోయికో నిర్ధారించారు. గోల్‌కు సుమారు 30 గజాల దూరంలో వదులుగా ఉన్న బంతిని అందుకుని, పలువురు న్యూ ఇంగ్లాండ్ డిఫెండర్ల మధ్య నుండి జిగ్‌జాగ్ పద్ధతిలో దూసుకెళ్లి, మెస్సీ తన మ్యాచ్ విన్నర్ గోల్‌కు ప్రధాన సూత్రధారి అయ్యాడు.



వన్డే ర్యాంకింగ్స్‌లో..

అఫ్ఘానిస్థాన్ సంచలనం

అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమిండియా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా భావిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే జట్లు ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. ఐసీసీ పురుషుల వన్డే జట్టు ర్యాంకింగ్స్‌లో ఇప్పటివరకు ఏడో స్థానానికి మించి ముందుకు వెళ్లని ఆ జట్టు తాజాగా శ్రీలంకను వెనక్కి నెట్టి ఆరో స్థానాన్ని దక్కించుకుంది. ఆఫ్ఘనిస్థాన్ ఖాతాలో 2,926 పాయింట్లు, 94 రేటింగ్ ఉన్నాయి. శ్రీలంక కూడా 94 రేటింగ్‌తో ఉన్నప్పటికీ 4,144 పాయింట్లతో ఏడో స్థానానికి పడిపోయింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో భారత జట్టు తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. టీమిండియా 4,122 పాయింట్లు, 115 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉంది.

న్యూజిలాండ్ 3,809 పాయింట్లు, 109 రేటింగ్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 3,547 పాయింట్లు, 104 రేటింగ్‌తో మూడో స్థానంలో ఉంది. పాకిస్థాన్ నాలుగో స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా ఐదో స్థానంలో ఉంది. పాకిస్థాన్‌కు 104 రేటింగ్, ఆస్ట్రేలియాకు 102 రేటింగ్ ఉన్నాయి. దీంతో ఈ రెండు జట్లు తొలి ఐదు స్థానాల్లో కొనసాగుతున్నాయి. కాగా 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది.

ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది.



న్యూజిలాండ్ టి20లో వ్యక్తిగత ప్రదర్శన..

జట్టు కూర్పు లోపం!

టీమిండియాలో వ్యూహాత్మక వైఫల్యం

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడినా, కష్టం మీద భారత్ 3-2తో గెలుచుకుంది. దీంతో ఈ సిరీస్ నుంచి టీమిండియా పలు కీలక అంశాలను నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా వ్యక్తిగత ప్రదర్శనలు, జట్టు కూర్పు, వ్యూహాత్మక నిర్ణయాలు చర్చనీయాంశమయ్యాయి. అభిషేక్ శర్మ తర్వాత అత్యధిక పరుగులు చేసింది నమన్ ధీర్. 5 మ్యాచ్‌ల్లో 138 పరుగులు బాదాడు. పేస్, స్పిన్ ఏ బౌలింగ్‌నైనా వేగంగా ఆడగలగడం అతడి ప్రత్యేకత. ముఖ్యంగా డెత్ ఓవర్లలో నమన్ విధ్వంసం సృష్టించాడు. తొలి టీ20లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించినప్పుడు, కేవలం 15 బంతుల్లోనే 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్‌ను గెలిపించాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు ఆఫ్ స్పిన్ ఆప్షన్ కూడా ఇచ్చే ఆటగాడి కోసం భారత్ చాలా కాలంగా వెతుకుతోంది. గతంలో రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్‌లను ఈ పాత్రలో ప్రయత్నించింది. ఇప్పుడు నమన్ ప్రదర్శనతో ఆ లోటు తీరే అవకాశం కనిపిస్తోంది. ఇక జట్టులోకి తిరిగొచ్చిన భువనేశ్వర్ కుమార్‌కు ఈ సిరీస్ కలిసిరాలేదు. 4 మ్యాచ్‌ల్లో 180 పరుగులు ఇచ్చి కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. కొత్త బంతిని స్వింగ్ చేసే అనుభవం, నైపుణ్యం భువీకి ఉన్నా, ఈ ప్రదర్శన అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వడానికి సరిపోదు. ఇక గాయం నుంచి కోలుకుని



జట్టులోకి వచ్చిన వరుణ్ చక్రవర్తి ఒక్క మ్యాచ్‌లోనే 45 పరుగులు ఇచ్చి ఒకే ఒక్క వికెట్ తీశాడు. ఈ ప్రదర్శన రీఎంట్రీ తర్వాత అతడి ప్రభావంపై ప్రశ్నలు రేకెత్తించింది. ఈ సిరీస్‌లో శివమ్ దూబే ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. నితీశ్‌కుమార్, నమన్ ధీర్ ఐదు మ్యాచ్‌ల్లోనూ ఆడటంతో, టీ20ల్లో దూబే పాత్రపై సందేహాలు మొదలయ్యాయి. మరోవైపు అక్షర్ పటేల్ నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం 3 వికెట్లే తీశాడు. బ్యాటింగ్‌లోనూ పెద్దగా ప్రభావం చూపలేదు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 32 బంతుల్లో చేసింది 42 పరుగులే. కాగా ఈ సిరీస్‌లో భారత్‌కు దక్కిన పెద్ద సానుకూల అంశాల్లో ప్రిన్స్ యాదవ్ ఒకడు. 4 మ్యాచ్‌ల్లో 2 వికెట్లు తీశాడు. కానీ అతడి అసలైన ప్రభావం డెత్ ఓవర్లలో పొదుపుగా బౌలింగ్ చేయడంలో కనిపించింది. అదే సమయంలో ప్రిన్స్ నాలుగు డెత్ ఓవర్లలో కేవలం 34 పరుగులే ఇచ్చాడు.



న్యూజిలాండ్‌తో అనధికారిక టెస్ట్..

42 రన్స్ వెనుకబడిన టీమిండియా

హ్యాగ్లీ ఓవల్: క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ మైదానంలో భారత్ ఎ, న్యూజిలాండ్ ఎ జట్ల మధ్య జరుగుతున్న రెండవ అనధికారిక టెస్టు మ్యాచ్ మూడవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తన రెండవ ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ క్రీజులో ఉన్నారు. సుదర్శన్, జైస్వాల్‌ల బౌలింగ్‌తో ఇండియా వికెట్లేమీ చేయకుండా నిలువరించింది. మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో 0 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసిన ఇండియా ఇప్పటికీ న్యూజిలాండ్ కంటే 46 పరుగులు వెనుకబడి ఉంది. యశస్వి జైస్వాల్ 38 బంతుల్లో 20 పరుగులతో నాటౌట్‌గా ఉండగా, సాయి సుదర్శన్ 28 బంతుల్లో 11 పరుగులు చేశాడు. రోజులోని చివరి బంతితో బ్రెట్ రాండెల్ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని విడగొట్టేంత దగ్గరగా వచ్చాడు. అతను వేసిన బంతి బయటకు కదలడంతో, దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన జైస్వాల్ వికెట్ కోల్పోయాడు. క్యాచ్ బిహైండ్ కోసం న్యూజిలాండ్ అప్పీల్ చేయగా అంపైర్ దానిని తిరస్కరించాడు. భారత ఓపెనర్లు చివరి సవాలును తట్టుకుని నిలబడి, తమ జట్టును సురక్షితంగా ఆట ముగిసే సమయానికి చేర్చారు. అంతకుముందు 218/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు సోమవారం ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 424 పరుగులకు ఆలౌట్ అయింది. తద్వారా తొలి ఇన్నింగ్స్‌లో 78 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కివీస్ బ్యాటర్లలో మాథ్యూ బోయ్స్ (110 పరుగులు), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (93 పరుగులు) రాణించారు. ఆఖర్లో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు జారెడ్ మెక్‌కే (33), జైడెన్ లెన్నాక్స్ (33) చివరి వికెట్‌కు 55 పరుగులు జోడించి భారత బౌలర్లను విసిగించారు. భారత పేసర్లు ముఖేష్ కుమార్ 5 వికెట్లు (5/87), మహ్మద్ సిరాజ్ 4 వికెట్లు (4/118) పడగొట్టి అద్భుత ప్రదర్శన చేశారు. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది.

దలాల్ స్ట్రీట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకంపనలు



ముంబయి, నవంబరు 2: ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తించిన రిలయన్స్ స్టాక్ ఒక్క దెబ్బతో తిరిగి తన ర్యాలీ తీసింది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల వెల్లడి తర్వాత సోమవారం ట్రేడింగ్ మొదలైన క్షణం నుంచే రిలయన్స్ షేర్లలో కొనుగోళ్ల సునామీ కనిపించింది. ట్రేడింగ్ ప్రారంభమైన కేవలం 45 నిమిషాల్లోనే షేరు ధర ఏకంగా 8 శాతానికి పైగా ఎగబాకి రూ. 1,259 వద్ద గరిష్ట స్థాయిని తాకింది. ఈ ఒక్క రోజు భారీ ర్యాలీతో రిలయన్స్ మార్కెట్ విలువ రూ. 1.29 లక్షల కోట్లకు పైగా పెరిగి, కంపెనీ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.17.04 లక్షల కోట్ల రికార్డు మైలురాయిని దాటేసింది. జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్ తర్వాత కూడా కదలని షేరును కంపెనీ ఆర్థిక ఫలితాలు సరికొత్త ఎత్తుకు చేర్చాయి. గత యేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 41 శాతం పెరిగి రూ. 25,548 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 18,165 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం 29 శాతం వృద్ధితో రూ. 3.32 లక్షల కోట్లకు పెరిగింది. రిటైల్ విభాగంలో క్విక్ కామర్స్ పోటీ వల్ల స్వల్ప ఒత్తిడి ఉన్నప్పటికీ,ఆయిల్ టు కెమికల్స్ విభాగం అంచనాలకు మించి రాణించింది. ఈ విభాగం ఎబిడిటా ఏకంగా 68 శాతం ఎగబాకి రికార్డు స్థాయిలో రూ. 25,203 కోట్లను తాకింది. అంతర్జాతీయంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, గ్యాస్ ఆయిల్ మార్జిన్లు 3.5 రెట్లకు పైగా పెరగడం సంస్థకు భారీగా కలిసొచ్చింది.అంబానీ కంపెనీ చూపించిన ఈ దూకుడుతో ప్రముఖ మార్కెట్ అనలిస్టులు తమ అంచనాలను పెంచేశారు. ప్రస్తుత ధరతో పోలిస్తే రాబోయే రోజుల్లో ఈ షేరు మరో 47 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. శీతాకాలంలో చమురు శుద్ధి మార్జిన్లు మరింత బలంగా ఉంటాయని అంచనా వేసింది. ఇక నోమురా రిలయన్స్ ఎబిట్డా తమ అంచనాల కంటే 9 శాతం ఎక్కువగా ఉందని చెబుతూ, రూ. 1,560 టార్గెట్‌తో 34 శాతం అప్‌సైడ్ ఉంటుందని తెలిపింది. నువామా కంపెనీ నికర అప్పు రూ. 1.17 లక్షల కోట్లతో పూర్తి నియంత్రణలో ఉందని స్పష్టం చేస్తూ రూ. 1,703 టార్గెట్ ఇచ్చింది. భవిష్యత్తులో ప్రారంభం కానున్న న్యూ ఎనర్జీ విభాగం లాభాలను మరో స్థాయికి తీసుకెళ్తుందని విశ్లేషించింది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 1,611కంటే ప్రస్తుత షేరు ధర ఇంకా దిగువనే ఉన్నప్పటికీ, సోమవారం నమోదైన ఈ దూకుడు గత నష్టాలన్నింటినీ భర్తీ చేసి కొత్త రికార్డుల దిశగా ర్యాలీకి బలమైన పునాదిని వేసిందని నిపుణుల అంచనా.

రూ.7 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి, నవంబరు 2: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ కీలక సూచీలు లాభాల బాటలో పయనించాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం, రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్ క్యూ2 ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధానంగా అండగా నిలిచాయి. దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నులో రాయితీలు లభించవచ్చన్న అంచనాలు, రూపాయి బలపడటం, బాండ్ ఈల్డ్స్ తగ్గడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు మీడియా, ఐటీ రంగాల షేర్లు నష్టాలను చవిచూశాయి. బిఎస్ఇలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువలు ఒక్కరోజే ఏకంగా 7 లక్షలకోట్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1,233.25 పాయింట్లు పెరిగి 75,692.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 387.70 పాయింట్లు లాభపడి 23,440.80 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3.09 శాతం, నిఫ్టీ 3.27 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీని పైకి నడిపించడంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (11.60), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.61), హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ (1.04) కీలక పాత్ర పోషించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 1.25 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 1.35 శాతం మేర పెరిగాయి. ఎన్ఎస్ఇలో మొత్తం 2,445 షేర్లు లాభపడగా, 1,164 షేర్లు నష్టపోయాయి. మరో 104 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధరలు భారీగా తగ్గాయి. డిసెంబరు 2026 కాంట్రాక్ట్ బ్యారెల్‌కు 5.01 డాలర్లు (4.42 శాతం) తగ్గి 108.42 డాలర్లకు చేరింది. ఎంసిఎక్స్‌లో డిసెంబరు 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.29 శాతం తగ్గి రూ.1,38,085కు చేరుకుంది. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి గత సెషన్‌లోని 7.412 శాతం నుంచి 7.323 శాతానికి తగ్గింది. అమెరికా 10 యేళ్ల బాండ్ ఈల్డ్ 0.06 శాతం తగ్గి 4.918 శాతానికి చేరింది.

విదేశీ మారక మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. గత సెషన్‌లో 94.7650 వద్ద ముగిసిన రూపాయి, ప్రస్తుతం 94.8100 వద్ద ట్రేడయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 40.64 శాతం పెరిగి రూ.25,548 కోట్లకు చేరినట్లు ప్రకటించడంతో రిలయన్స్ షేరు 11.60 శాతం దూసుకెళ్లింది. జియో ప్లాట్‌ఫామ్స్: క్యూ2లో జియో ప్లాట్‌ఫామ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 13.69 శాతం పెరిగి రూ.8,389 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.7,379 కోట్లుగా నమోదైంది. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ కన్సాలిడేటెడ్ పన్ను అనంతర లాభం గత యేడాదితో పోలిస్తే 35.9 శాతం పెరిగి రూ.3,278 కోట్లకు చేరడంతో షేరు 4.41 శాతం లాభపడింది. మదర్సన్ సుమి వైరింగ్ ఇండియా కంపెనీ షేరు 10.36 శాతం పెరిగింది. ఇంజినీర్స్ ఇండియా కంపెనీ షేరు 15.01 శాతం దూసుకెళ్లింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 173.84 శాతం పెరిగి రూ.21,630.03 కోట్లకు చేరడంతో షేరు 3.41 శాతం లాభపడింది. పిసి జ్యువెలర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ గార్గ్, కంపెనీ సెక్రటరీ విజయ్ పన్వార్‌లకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పరిపాలనా హెచ్చరిక లేఖలు జారీ చేయడంతో షేరు 3.62 శాతం పడిపోయింది. జెన్ టెక్నాలజీస్ కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం గత యేడాదితో పోలిస్తే 50.74 శాతం పెరిగి రూ.89.54 కోట్లకు చేరడంతో షేరు 8.32 శాతం ఎగబాకింది. ఇండిగో పెయింట్స్ కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 46.97 శాతం తగ్గి రూ.13.32 కోట్లకు చేరడంతో షేరు 12.76 శాతం క్షీణించింది.

ఐటిసి ఆదాయం 1.8 శాతం వృద్ధి

రెండోత్రైమాసికంలో రూ.18,401 కోట్లు రాబడి



ముంబయి, నవంబరు 2: ఎఫ్ఎంసిజి సంస్థ ఐటిసి రెండో త్రైమాసికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాల్లో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.18,401 కోట్లుగా ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదేత్రైమాసికంలో నమోదైన రూ.18,081 కోట్లతో పోలిస్తే ఆదాయం 1.8 శాతం పెరిగింది. కంపెనీ ఆదాయం రూ.17,520 కోట్లుగా ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేయగా, వాస్తవంగా రూ.18,401 కోట్లకు చేరింది. లాభదాయకత విషయంలో కంపెనీకి నిరాశ ఎదురైంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,176 కోట్లుగా ఉన్న నికర లాభం ఈసారి 20.1 శాతం తగ్గి రూ.4,137 కోట్లకు పరిమితమైంది. కంపెనీ లాభాల మార్జిన్ అంతకుముందు త్రైమాసికంలోని 34.6 శాతం నుంచి 28 శాతానికి తగ్గింది. ఎఫ్ఎంసిజి, వ్యవసాయ వ్యాపార విభాగాల్లో వృద్ధినమోదుచేసింది. ఐటిసి ప్రధాన వ్యాపార విభాగాల్లో ఆదాయ వృద్ధి నమోదైంది. ఎఫ్ఎంసిజి విభాగం కంపెనీకి ప్రధాన ఆదాయ వనరుగా కొనసాగింది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ విభాగం ఆదాయం రూ.22,503.30 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.14,746.35 కోట్లుగానమోదైంది. ఎఫ్ఎంసిజి విభాగంలో సిగరెట్ల వ్యాపారం ద్వారా రూ.15,536.13 కోట్ల ఆదాయం రాగా, ఇతర ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల ద్వారా రూ.6,967.17 కోట్ల ఆదాయం సమకూరింది. వ్యవసాయ వ్యాపార విభాగం ఆదాయం గత యేడాది రూ.3,976.24 కోట్లతో పోలిస్తే ఈసారి రూ.4,451.69 కోట్లకు పెరిగింది. పేపర్‌బోర్డులు, పేపర్, ప్యాకేజింగ్ విభాగం ఆదాయం కూడా రూ.2,219.92 కోట్ల నుంచి రూ.3,015.85 కోట్లకు పెరిగింది. అయితే అన్ని వ్యాపార విభాగాల మొత్తం ఫలితాలు గత యేడాది ఇదే త్రైమాసికంలోని రూ.6,320.72 కోట్ల నుంచి రూ.5,156.55 కోట్లకు తగ్గాయి. స్టాక్ మార్కెట్‌లో ఐటిసి షేర్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. గత ముగింపు ధర రూ.265.60తో పోలిస్తే రూ.0.80 పెరిగి రూ.266.40 వద్ద స్థిరపడ్డాయి. ఆ రోజు ట్రేడింగ్‌లో షేరు రూ.266 వద్ద ప్రారంభమై, ఇంట్రాడే గరిష్ఠంగా రూ.269.30, కనిష్ఠంగా రూ.264 స్థాయినితాకింది. ఐటీసీ ఆదాయం మార్కెట్ అంచనాలను అధిగమించినప్పటికీ, నికర లాభం తగ్గడం, లాభాల మార్జిన్లు క్షీణించడం ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



ఇకపై ఇపిఎఫ్‌వో ఖాతా నిల్వలు వాట్సాప్‌లోనే

న్యూఢిల్లీ, నవంబరు 2: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ చందాదారులు ఇకపై వాట్సాప్ ద్వారానే పిఎఫ్ ఖాతాలో ఎంత డబ్బు ఉందో తెలుసుకోవచ్చు. ఖాతాలో ఇటీవలజరిగిన ఐదు లావాదేవీల వివరాలను చూడటంతో పాటు పిఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందవచ్చు. ఈ కొత్త సదుపాయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సేవలను వినియోగించుకునేందుకు చందాదారులు ఇపిఎఫ్‌వో అధికారిక వాట్సాప్ సేవను మాత్రమే ఉపయోగించాలి.

వాట్సాప్ సేవతో పాటు మరో కీలక నిర్ణయాన్ని ఇపిఎఫ్‌వో ప్రకటిం చింది. ఆధార్ ధ్రువీకరణ పూర్తయిన, నిలిచిపో యిన పిఎఫ్ ఖాతాల్లో రూ.1,000 లేదా అంతకంటే తక్కువ మొత్తం ఉన్న అర్హులైన చందాదారులకు డబ్బు తిరిగి చెల్లించే ప్రక్రియను ఆటోమేటిక్‌గా ప్రారంభించనున్నారు.

విదేశీ ఇన్వెస్టర్లకు 12.5% ఎల్‌టిసిజి పన్ను రద్దు చేయాలి

సెబీ ప్రతిపాదన



న్యూఢిల్లీ, నవంబరు 2: భారత ఈక్విటీ మార్కెట్లలో పెరుగుతున్న లావాదేవీల వ్యయాలపై భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు సెబీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో 2027-28 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి ముందస్తు ప్రతిపాదనల్లో భాగంగా పలు పన్ను సంస్కరణలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది. సెబీ చేసిన కీలక ప్రతిపాదనల్లో భారత ఈక్విటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) చేసే పెట్టుబడులపై ప్రస్తుతం విధిస్తున్న 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టిసిజి)ను రద్దు చేయాలనిప్రతిపాదించింది. అలాగే ఏడాదికి పైగా పెట్టుబడులను కొనసాగించిన మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు ఒక పథకం నుంచి మరో పథకానికి మారినప్పుడు పన్ను భారం పడకుండా అవకాశం కల్పించాలని కూడా ప్రతిపాదించింది. భారత స్టాక్ మార్కెట్లలో లావాదేవీలకు అయ్యే ఖర్చులు పెరుగుతున్నాయని సెబీ పేర్కొంది. ముఖ్యంగా సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ పెట్టుబడిదారులకు అదనపు భారమని చెపుతోంది. షేర్ల కొనుగోలు, విక్రయాలపై విధించే ఈ పన్ను కారణంగా ట్రేడింగ్ వ్యయాలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్న విషయాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. లావాదేవీల ఖర్చులు అధికంగా ఉండటం వల్ల మార్కెట్లో పెట్టుబడిదారుల భాగస్వామ్యం తగ్గే అవకాశం ఉందని, అంతర్జాతీయ మార్కెట్లతో పోలిస్తే భారత ఈక్విటీ మార్కెట్ల పోటీతత్వంపైనా ప్రభావం పడవచ్చని సెబీ అభిప్రాయపడింది. ట్రేడింగ్ వ్యయాలను తగ్గించడం ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్లు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని సూచించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల్లో పెట్టే పెట్టుబడులపై విధిస్తున్న 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును తొలగించాలని సెబీ ప్రతిపాదించింది. భారత మార్కెట్లలో విదేశీ పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్నిపెంచడం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే గమ్యస్థానంగా దేశీయ మార్కెట్ల పోటీతత్వాన్ని మెరుగుపరచడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. భారత ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్‌పీఐలు కీలకమైన పెట్టుబడి వనరుగా ఉన్నారు. పన్ను విధానంలో మార్పులు విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్ల ఆకర్షణను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లకు మరింత వెసులుబాటు కల్పించేదిశగా సెబీ మరో కీలక ప్రతిపాదన చేసింది. ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి మరో పథకానికి మారేటప్పుడు, సదరు పెట్టుబడులను యేడాదికి పైగా కొనసాగించి ఉంటే తక్షణ పన్ను భారం లేకుండా మార్పిడికి అవకాశంకల్పించాలని సూచించింది. ప్రస్తుతం ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి మరో పథకానికి మారడాన్ని సాధారణంగా పాత పథకం నుంచి పెట్టుబడుల ఉపసంహరణగా, కొత్త పథకంలో తాజా పెట్టుబడిగా పరిగణిస్తారు. దీంతో పెట్టుబడి కాలవ్యవధి, వర్తించే పన్ను నిబంధనల ఆధారంగా మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి రావచ్చు. సెబీ ప్రతిపాదన అమలైతే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను అవసరానికి అనుగుణంగా మార్చుకోవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.